



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 11 సంచిక : 220 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం బుధవారం 16 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 220 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM WED 16 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur


# ఏపీలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కు కేబినెట్ ఆమోదం

- సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం
- పలు కీలక అంశాలపై చర్చ
- ఎస్సీ వర్గీకరణ ముసాయిదా ఆర్డినెన్స్ కు పచ్చజెండా
- మీడియాకు వివరాలు తెలిపిన మంత్రులు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రిమండలి పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వర్గీకరణకు సంబంధించిన ముసాయిదా ఆర్డినెన్స్‌కు కేబినెట్ ఆమోదం తెలిపింది. దీంతో పాటు రాజధాని అమరావతిలో కీలక నిర్మాణాలకు నిధులు, ఐటీ అభివృద్ధికి భూ కేటాయింపులు, సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలపై కూడా మంత్రిమండలి నిర్ణయాలు తీసుకుంది. ఈ మేరకు మంత్రులు డోలా బాలవీరాంజనేయస్వామి, నిమ్మల రామానాయుడు, అనిత మీడియాకు వివరాలు తెలిపారు.

**ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కు పచ్చజెండా**

షెడ్యూల్డ్ కులాల్లోని 59 ఉపకులాల మధ్య సామాజిక అంతరాలు, వెనుకబాటుతనం ఆధారంగా వర్గీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు సంబంధించి గతంలో నియమించిన జస్టిస్ రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిషన్ నివేదిక, సుప్రీంకోర్టు తీర్పులను పరిగణనలోకి తీసుకుని, జాతీయ ఎస్సీ కమిషన్ సూచనల మేరకు ముసాయిదా ఆర్డినెన్స్‌ను సిద్ధం చేశారు. దీనికి కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ వర్గీకరణ ప్రకారం 59 ఉపకులాలను మూడు గ్రూపులుగా విభజించినట్లు మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి తెలిపారు. గ్రూప్-1లోని 12 ఉపకులాలకు 1 శాతం, గ్రూప్-2లోని 18 ఉపకులాలకు 6.5 శాతం, గ్రూప్-3లోని 29 ఉపకులాలకు 7.5 శాతం రిజర్వేషన్లు వర్తింపజేయనున్నట్లు ఆయన వివరించారు. విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్ ఫలాలు అన్ని ఉపకులాలకు సమానంగా అందేలా 200 పాయింట్ల రోస్టర్ విధానాన్ని అమలు చేయనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. "ఎస్సీ ఉపకులాల ఏకీకృత, సమానమైన పురోగతి కోసం ఈ నిర్ణయం తీసుకున్నాం. దీని ద్వారా రాజ్యాంగ లక్ష్యాలను సాధించగలమని భావిస్తున్నాం" అని మంత్రి డోలా తెలిపారు.

వివరాలు 2లో..

## ప్రభుత్వ కాలేజీల్లో చదివితే మార్కులు రావనే అపోహను మీరు చెరిపేశారు

- ఇటీవల ఇంటర్ రిజల్ట్స్ విడుదల
- ప్రభుత్వ కాలేజీల్లో మెరుగైన ఫలితాలు
- ఉండవల్లి నివాసంలో షైనింగ్ స్టార్స్-2025 కార్యక్రమం
- 52 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్, ల్యాప్ టాప్స్ బహూకరించిన లోకేశ్



పెన్ పవర్ డెస్క్:ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివి ఇంటర్మీడియట్‌లో రాష్ట్రస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఘనంగా సత్కరించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివితే మంచి మార్కులు రావనే అపోహను తొలగించి, ప్రభుత్వ విద్య గౌరవాన్ని నిలిపారని ఆయన విద్యార్థులను ప్రశంసించారు. ఉండవల్లిలోని తన నివాసంలో 'షైనింగ్ స్టార్స్-2025' పేరిట ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 52 మంది ప్రతిభావంతులైన విద్యార్థులను మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా వారికి బంగారు పతకాలు (గోల్డ్ మెడల్స్) అందించి, ల్యాప్‌టాప్‌లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, విద్యార్థుల విజయానందాన్ని పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని తెలిపారు.

వివరాలు 2లో..

### మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి

## సిట్ నోటీసులు



పెన్ పవర్ డెస్క్:మద్యం కుంభకోణం ఆరోపణల కేసులో మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు ఇచ్చింది. ఈ నెల 18న విజయవాడ సీపీ కార్యాలయంలో విచారణకు హాజరుకావాలని పేర్కొంది. వైసీపీ హయాంలో లిక్కర్ స్కామ్ జరిగిందని కూటమి ప్రభుత్వం ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా దర్యాప్తునకు సిట్‌ను ఏర్పాటు చేసింది. ఇక మద్యం కుంభకోణంపై

వివరాలు 2లో..

## అలా చేస్తే పాఠశాలల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తాం

**ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా హెచ్చరిక**

- ఏకపక్షంగా ఫీజులు పెంచడం, వేధించడాన్ని సహించేది లేదన్న ముఖ్యమంత్రి
- యాజమాన్యాలు నియమ, నిబంధనలు పాటించాలని సూచన
- ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తే నోటీసులు ఇస్తామన్న ముఖ్యమంత్రి



పెన్ పవర్ డెస్క్:పాఠశాలల అధిక రుసుముల వసూళ్లపై ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తీవ్రంగా స్పందిం చారు. పాఠశాలల్లో ఏకపక్షంగా ఫీజులు పెంచితే ఉపేక్షించేది లేదని, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

వివరాలు 2లో..

## పవన్ 'కన్వర్టెడ్ సనాతని'

- పవన్ కళ్యాణ్‌పై వైసీపీ నేత పేర్ని నాని విమర్శలు
- పవన్ కళ్యాణ్ 'కన్వర్టెడ్ సనాతని' అంటూ వ్యాఖ్య
- ఎన్నికల ముందు అన్ని మతాలు సమానమని చెప్పి, గెలిచాక మారారని ఆరోపణ
- కాషాయ వస్త్రాలు ధరించి సనాతన ధర్మ పరిరక్షకుడిగా ప్రకటించుకున్నారని ఎద్దేవా
- పవన్ తన వైఖరిని స్పష్టంగా ప్రకటించారని, ఇక ప్రశ్నించేదేమీ లేదని వ్యాఖ్య

వివరాలు 2లో..



## విశాఖ నుంచి అమరావతికి హైదరాబాద్ మీదుగా రావాలా?

- విశాఖ-విజయవాడ మధ్య నడిచే మార్నింగ్ ఫ్లైట్స్ రద్దు
- దాంతో తీవ్ర అసౌకర్యం కలుగుతోందన్న గంటా
- అమరావతి చేరుకోవడానికి రెండు విమానాలు మారాల్సి వచ్చిందని ఆవేదన



పెన్ పవర్ డెస్క్:విశాఖ-విజయవాడ నగరాల మధ్య ఉదయం నడిచే రెండు విమాన సర్వీసులు రద్దు చేయడం వల్ల తీవ్ర అసౌకర్యం కలుగుతోందని టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తనకు, ఇతర ప్రయాణికులకు ఎదురైన అనుభవాలను ఆయన సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆంధ్రాలో ఒక ప్రాంతం నుంచి

వివరాలు 2లో..

### ఈ ఏడాది దేశంలో

## సాధారణం కంటే అధిక వర్షపాతం

- నైరుతి రుతుపవనాల సీజన్ పై ఐఎండీ అంచనాలు
- దీర్ఘకాలిక సగటు వర్షపాతం 87 సెంమీ
- ఈ ఏడాది 105 శాతం వర్షపాతం నమోదవుతుందన్న ఐఎండీ



పెన్ పవర్ డెస్క్:దేశ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఊరటనిచ్చే వార్తను అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాల సీజన్ దేశవ్యాప్తంగా సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదవుతుందని అంచనా వేసింది. ఈ మేరకు తన దీర్ఘకాలిక అంచనా వివరాలను వెల్లడించింది. దీర్ఘకాలిక సగటు (ఎల్పీఏ) 87 సెంటీమీటర్లతో పోలిస్తే, ఈసారి 105 శాతం వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ తెలిపింది. ఈ అంచనాలో

వివరాలు 2లో..

### తమిళనాడు 'స్వయంప్రతిపత్తి'

## కోసం కీలక కమిటీ

- గవర్నర్‌తో విభేదాల నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం
- స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను సిఫార్సు చేయనున్న కమిటీ
- పెండింగు బిల్లులపై సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో స్టాలిన్ ప్రభుత్వం నిర్ణయం



పెన్ పవర్ డెస్క్:వివిధ అంశాలపై కేంద్ర ప్రభుత్వం, గవర్నర్‌తో విభేదాలు నెలకొన్న నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర

వివరాలు 2లో..

### ఢిల్లీ, ముంబై రెడ్ జోన్‌లో ఉన్నాయి...

## ఢిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు ఖాయం

- పరిస్థితి ఇలాగే ఉంటే ప్రజల ఆయుర్దాయం తగ్గుతుందన్న గడ్కరీ
- ప్రజలు శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని సూచన
- ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాల్సిన సమయం వచ్చిందని వెల్లడి



పెన్ పవర్ డెస్క్: కాలుష్యం విషయంలో ఢిల్లీ, ముంబై నగరాలు రెడ్ జోన్‌లో ఉన్నాయని, దేశ రాజధానిలో మూడు రోజులు ఉంటే అనారోగ్యం పాలవడం ఖాయమని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే దేశ రాజధానిలో నివసించే ప్రజల ఆయుర్దాయం పదేళ్లు తగ్గుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజలు ఇప్పటికైనా శిలాజ ఇంధనాల వాడకాన్ని తగ్గించాలని సూచించారు. రాష్ట్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, ఆర్థిక వ్యవస్థకు ఇచ్చే ప్రాధాన్యతను పర్యావరణానికి కూడా

వివరాలు 2లో..

## పవన్‌కు అస్వస్థత... కేబినెట్ భేటీ ప్రారంభానికి ముందే వెళ్లిపోయిన డిప్యూటీ సీఎం!

- ఏపీ సచివాలయంలో కేబినెట్ భేటీ
- ఉదయం 10.30 గంటలకు మంత్రివర్గ సమావేశానికి వచ్చిన డిప్యూటీ సీఎం
- కేబినెట్ భేటీ ప్రారంభానికి ముందే ఆయనకు అస్వస్థత
- ఆరోగ్యం సహకరించక సమావేశం ప్రారంభమయ్యేలోపే క్యాంపు ఆఫీస్‌కి వెళ్లిపోయిన పవన్

పెన్ పవర్ డెస్క్:ప్రస్తుతం ఏపీ సచివాలయంలో కేబినెట్ భేటీ కొనసాగు తోంది. సీఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరుగు తున్న ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చ జరుగుతోంది. అయితే, ఈ భేటీలో మరోసారి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కుర్చీ ఖాళీగానే కనిపించింది. ఉదయం 10.30 గంటల ప్రాంతంలో పవన్ మంత్రి వర్గ సమావేశానికి వచ్చారు. అయితే, కేబినెట్ భేటీ ప్రారంభానికి ముందే ఆయన

వివరాలు 2లో..



## నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసు.. సోనియా, రాహుల్ గాంధీలపై ఈడీ ఛార్జ్‌షీట్

- మనీలాండరింగ్ కేసులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ
- కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిట్రోడా పేరును కూడా చేర్చిన ఈడీ
- ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ



పెన్ పవర్ డెస్క్:నేషనల్ హెరాల్డ్ మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఈ ఛార్జిషీట్‌లో కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ పేర్లను పేర్కొంది. ఇదివరకే ఈ కేసుతో సంబంధం ఉన్న ఆస్తుల స్వాధీనానికి ఈడీ నోటీసులు జారీ చేసింది. తాజాగా కాంగ్రెస్ ఎంపీలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో పాటు ఆ పార్టీ ఓవర్సీస్ యూనిట్ చీఫ్ శామ్ పిట్రోడా పేర్లను పేర్కొంటూ ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో ఈడీ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఏప్రిల్ 25వ తేదీన ప్రత్యేక కోర్టు ఈ కేసును విచారించనుంది. సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడం ఇదే మొదటిసారి. హర్యానాలో జరిగిన రియల్ ఎస్టేట్ ఒప్పందంతో ముడిపడి ఉన్న మనీలాండరింగ్ ఆరోపణలపై రాబర్ట్ వాద్రాను ఈడీ ప్రశ్నించిన కొన్ని గంటల్లోనే ఈ పరిణామం చోటుచేసుకుంది.

## ఎడిటర్ వ్యూ

# సజ్జల హవానేనా...

వైసీపీ అధినేత జగన్ అధికారాన్ని కోల్పోయినా ఆయనలో మార్పు రాలేదని స్పష్టంగా తెలుస్తుంది. ఎంత మంది పార్టీ నేతలు వెళ్లింది కారణాలు ఎవరని చెప్పిందీ అందరికీ తెలుసు. అందరి వేళ్లూ చూపించిన వారినే అందలం ఎక్కించుకుంటుంటే ఇక జగన్ వైఖరిలో ఏం మార్పు వచ్చినట్లు? సీట్ల కేటాయింపుల దగ్గర నుంచి ముఖ్యమైన నిర్ణయాల వరకూ.. ఐదేళ్లలో అన్ని శాఖలపై పెత్తనం వెలగబెట్టిన సజ్జల రామకృష్ణారెడ్డికి మరోసారి జగన్ కీలక పదవి కట్టబెట్టడం పార్టీలోనే చర్చనీయాంశమైంది. సజ్జల రామకృష్ణారెడ్డిని పీఏసీ కన్వీనర్ గా నియమించడం జగన్ చేసిన అతి పెద్ద తప్పు అంటూ ఇప్పటికే వైసీపీ సోషల్ మీడియాలో పెద్దయెత్తున పోస్టులు కనపడుతున్నాయి.. అధికారంలో ఉన్న ఐదేళ్ల కాలంలో సజ్జల రామకృష్ణారెడ్డి వ్యవహరించిన తీరు వివాదాలకు నిలయంగా మారింది. నాటి ప్రతిపక్ష పార్టీలు విమర్శిస్తే అది రాజకీయ విమర్శలు అని సరిపెట్టుకోవచ్చు. కానీ పార్టీని వీడి వెళ్లిపోతున్న నేతలందరూ సజ్జల వైపు చూపుతున్నారు. చివరకు జగన్ కు కష్టకాలంలో అండగా ఉండి ఆయనతో పాటు జైలుకు వెళ్లి పదహారు నెలలు గడిపి వచ్చిన విజయసాయిరెడ్డి కూడా కోటరీ అంటూ పరోక్షంగా సజ్జల రామకృష్ణారెడ్డి వైపు చూపారు. అంటే ఆయనపై పార్టీలో ఏ స్థాయిలో వ్యతిరేకత ఉందో అర్థం చేసుకోవచ్చు. పార్టీ నుంచి వెళ్లి పోయేవారు సజ్జల ను కార్నర్ చేస్తున్నారని జగన్ భావిస్తే అంతకంటే మించిన కామెడీ మరొకటి ఉండదు. ఎందుకంటే జగన్ కు తెలియకుండా సజ్జల రామకృష్ణారెడ్డి అనేక పనులు ఐదేళ్లలో చక్కపెట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యమైన పదవుల నియామకం నుంచి పార్టీ ఇన్ ఛార్జుల మార్పు వరకూ అంతా సజ్జల చెప్పినట్లే జరిగిందంటారు. జగన్ వద్దకు కనీసం వెళ్లేందుకు కూడా సజ్జల అంగీకరించేవారు కాదు. అంతా తన వద్దనే సర్దుబాటు చేసి మంత్రులను, ఎమ్మెల్యేలను పంపేవారు. జగన్ తనకు చెప్పారంటూ నేతలకు చెబుతుండటంతో అది నిజమేనని నమ్మిన నేతలు మౌనంగానే వెనక్కు వెళ్లిపోయేవారు. అలాగే క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఎప్పటికప్పుడు జగన్ దృష్టికి తీసుకెళ్లకుండా సజ్జల రామకృష్ణారెడ్డి అడ్డుకున్నారన్న విమర్శలు కూడా ఫ్యాన్ పార్టీలో వినిపించాయి.అలాంటి సజ్జల రామకృష్ణారెడ్డి గత ఎనిమిది నెలలుగా కొంత దూరంగా ఉంటున్నారు. అయితే జగన్ కూడా ఆయనను దూరం పెట్టారులే అని అందరూ అనుకున్నారు. కానీ పీఏసీ కమిటీ కన్వీనర్ గా నియమించడంతో జగన్ వద్ద సజ్జల రామకృష్ణారెడ్డి హవా ఏమాత్రం తగ్గలేదన్నది మరోసారి స్పష్టమయింది. సజ్జల వల్ల పార్టీకి ప్రయోజనం లేకపోగా, నష్టమేనని అందరూ చెబుతున్నప్పటికీ జగన్ మాత్రం మొండిగా వ్యవహరించడం పట్ల వైసీపీ సీనియర్ నేతలు సయితం ఒకింత ఇబ్బందులు పడుతున్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఐదేళ్ల కాలంలో ఉన్న పరిస్థితులు వైసీపీలో ఏం మారలేదనడానికి సజ్జల రామకృష్ణారెడ్డి నియామకమే నిదర్శనమని అంటున్నారు. మరి సజ్జల వల్ల ఉపయోగం జగన్ కు మాత్రమే తెలుసా? ఆయన వైఖరిలో మార్పు రాదన్నది ఈ నియామకంతో వెల్లడయింది.

**మండిపడుతున్న సీనియర్లు**

నమ్మకం.. ఈ మాట ఎంత దూరమైనా తీసుకెళ్తుంది. నమ్మకం ఉండాలి తప్పు.. అదే నమ్మకాన్ని గుడ్డిగా ఫాలో కాకూడదు. ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి చేస్తోంది అదే. ఏకంగా పార్టీని సజ్జల రామకృష్ణారెడ్డి చేతిలో పెట్టేశారు. తాను పార్టీ అధినేతగా కొనసాగుతుండగా.. పార్టీలో అత్యంత విలువైన రాజకీయ వేదికగా ఉన్న పొలిటికల్ అడ్వైజరీ కమిటీకి సజ్జల వారిని చైర్మన్ చేశారు. అంటే తన తర్వాత సజ్జల రామకృష్ణారెడ్డి అన్ని అంటూ సంకేతాలు ఇచ్చారు. అయితే సజ్జల వల్లే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఈ పరిస్థితి వచ్చిందన్నది మెజారిటీ నేతల అభిప్రాయం. కానీ జగన్మోహన్ రెడ్డి దానిని విశ్వసించలేదు. సజ్జల రామకృష్ణారెడ్డి పై నమ్మకం పెట్టుకొని ఏకంగా పొలిటికల్ అడ్వైజరీ కమిటీ అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టారు.సజ్జల రామకృష్ణారెడ్డి ఎక్కడో సాక్షి ఎడిటోరియల్ డైరెక్టర్ గా ఉండేవారు. అటువంటి వ్యక్తిని తెచ్చి పార్టీ కార్యక్రమాలను అప్పగించారు. పార్టీ అధికారంలోకి రావడంతో ప్రభుత్వంలోనూ కీలక బాధ్యతలు కట్టబెట్టారు. చివరకు పార్టీలో కూడా విశేష హక్కులు కల్పించారు. కానీ జగన్మోహన్ రెడ్డి తో నడిచిన నేతలకు ఇది మింగుడు పడని విషయం. ముఖ్యంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సీనియర్లు సజ్జల విషయంలో భిన్నభిప్రాయాలతో ఉన్నారు. అసలు రాజకీయాలతో సంబంధం లేని సజ్జలను తమపై రుద్దడాన్ని ఎక్కువమంది వ్యతిరేకిస్తున్నారు. గత ఐదేళ్ల వైసిపి అధికారంలో ఉండేటప్పుడు ఏ నిర్ణయం అయినా చెల్లి పోయింది. కానీ ఇప్పుడు సజ్జలను తమపై వేయడం ఏమిటన్న అభిప్రాయం సీనియర్లలో ఉంది.తెలుగుదేశం పార్టీకి పొలిట్ బ్యూరో ఉంది. దానిలో దాదాపు 30 మంది వరకు సభ్యులు ఉన్నారు. దానికి అధ్యక్ష పదవి అంటూ లేదు. పార్టీ అధినేత చంద్రబాబు.. పొలిట్ బ్యూరో సమావేశానికి అధ్యక్షత వహిస్తారు. ఆయన మార్గదర్శకంలోనే అత్యున్నత సమావేశంలో రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారు. కానీ ఇప్పుడు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పొలిటికల్ అడ్వైజరీ కమిటీ లో అందుకు భిన్నం జరుగుతోంది. ఏకంగా ఆ కమిటీ అధ్యక్ష బాధ్యతలను సజ్జల రామకృష్ణారెడ్డికి అప్పగించారు జగన్. ఇది ఎంత మాత్రం వైసీపీ సీనియర్లకు రుచించడం లేదు. సజ్జల తీరు వల్లే పార్టీ ఓడిపోయింది అన్నది ఎక్కువమంది అభిప్రాయం. అటువంటి వారంతా ఇప్పుడు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదేళ్లలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రభుత్వం పై పెత్తనం చేశారు సజ్జల రామకృష్ణారెడ్డి. ఆయన కుమారుడు భార్గవరెడ్డి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా విభాగాన్ని చూసేవారు. ఈ ఇద్దరు తండ్రి కుమారులు ఆర్థికంగా బలపడ్డారు. కానీ పార్టీకి మైనస్ చేశారు అన్నది సీనియర్ నేతల అభిప్రాయం. అందుకే సీనియర్లు సజ్జల తాజా నియామకాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఎవరి తీరుతో ఓటమి చెందామో.. అటువంటి వ్యక్తికి బాధ్యతలు ఇవ్వడం ఏమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. మొత్తానికైతే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో సజ్జల నియామకం వివాదానికి దారి తీసినట్టు ఉంది.

# ఏపీలో ఎస్సీ వర్గీకరణ ఆర్డినెన్స్ కు కేబినెట్ ఆమోదం

- మొదటి పేజీ తరువాయి

**రాజధాని నిర్మాణం, సీఆర్డీఏ నిర్ణయాలు**

అమరావతిలో పరిపాలన భవనాల నిర్మాణానికి సంబంధించి కూడా కేబినెట్ కీలక నిర్ణయాలు తీసుకుంది. నూతన అసెంబ్లీ భవన నిర్మాణానికి రూ. 617 కోట్లు, హైకోర్టు భవన నిర్మాణానికి రూ. 786 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. టెండర్లలో ఎల్-1 బిడ్డర్‌లకు లెటర్ ఆఫ్ అగ్రిమెంట్ (%వాశీూ%) అందజేసే అధికారాన్ని సీఆర్డీఏ కమిషనర్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. సీఆర్డీఏ 46వ అథారిటీ తీసుకున్న నిర్ణయాలకు కూడా కేబినెట్ ఆమోదం లభించింది.

**ఐటీ, సంక్షేమ రంగాలపై దృష్టి**

రాష్ట్రంలో ఐటీ రంగాన్ని బలోపేతం చేసే దిశగా విశాఖపట్నంలో ఐటీ హిల్-3 వద్ద ప్రముఖ సంస్థ టీసీఎస్‌కు 21.66 ఎకరాలు, ఉరుస క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు 3.5 ఎకరాలు కేటాయించాలని కేబినెట్ నిర్ణయించింది. అలాగే కాపులుప్పాడలో ఉరుస క్లస్టర్స్‌కు మరో 56 ఎకరాలు కేటాయించారు. సంక్షేమ పథకాల అమలుపైనా కేబినెట్ దృష్టి సారించింది. ఈ నెల 26న మత్స్యకార భరోసా పథకం కింద అర్హులైన మత్స్యకారులకు రూ. 20,000 చొప్పున ఆర్థిక సాయం అందించాలని నిర్ణయించినట్లు హోంమంత్రి అనిత తెలిపారు.

**ఇతర కీలక నిర్ణయాలు**

వీటితో పాటు, బలిమెల, జోలాపుట్ రిజర్వాయర్లపై 30 మెగావాట్ల సామర్థ్యంతో రెండు హైడల్ ప్రాజెక్టుల నిర్మాణానికి, పవన, సౌర విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. త్వరలోనే డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసి, వచ్చే విద్యా సంవత్సరంలోగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు. గుంటూరులో ఈఎస్ఐ ఆస్పత్రికి ఉచితంగా భూమి కేటాయించాలని, గ్రేహౌండ్స్ విభాగానికి కొత్తవలసలో భూమి ఇవ్వాలని, రాష్ట్రంలో భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా మంత్రిమండలి నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు

## మాజీ ఎంపీ విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు

- మొదటి పేజీ తరువాయి

సిట్ ఇప్పటికే కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి ఇళ్లు, కార్యాలయాల్లో సోమవారం సోదాలు చేసింది. హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో 50 మంది సిట్ అధికారులు ఇందులో పాల్గొన్నారు. ఈ కేసులో కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డికి మూడుసార్లు అధికారులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన విచారణకు హాజరు కాలేదు. ఆయనను విచారిస్తే ఈ స్కామ్‌కు సంబంధించి కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ క్రమంలోనే ఈరోజు విజయసాయిరెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది.

## విశాఖ నుంచి అమరావతికి హైదరాబాద్ మీదుగా రావాలా?

- మొదటి పేజీ తరువాయి

మరో ప్రాంతానికి వెళ్లాలంటే తెలంగాణ మీదుగా వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. "ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రాజధాని విశాఖ నుంచి ఆంధ్రప్రదేశ్ పరిపాలన రాజధాని అమరావతి వెళ్లాలంటే తెలంగాణ రాజధాని హైదరాబాద్ మీదుగా ప్రయాణించాల్సి రావడం బాధాకరం. ఇవాళ ఉదయం 8 గంటలకు విశాఖ ఎయిర్ పోర్టుకు వచ్చిన నేను విమానంలో హైదరాబాద్ చేరుకుని, అక్కడి నుంచి విజయవాడ విమానం ఎక్కి గన్నవరం ఎయిర్ పోర్టులో దిగేసరికి మధ్యాహ్నం ఒంటి గంట అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాయంత్రం సమావేశం కావడానికి విశాఖ నుంచి బయలుదేరిన సీఐఐ, ఫిక్కీ వంటి ట్రేడ్ ప్రతినిధులు కూడా నాలానే హైదరాబాద్ మీదుగా విజయవాడ చేరుకున్నారు. విశాఖ-విజయవాడ మధ్య ఉదయం వేళల్లో నడిచే రెండు విమానాలు రద్దు చేయడంతో ఈ పరిస్థితి వచ్చింది. దురదృష్టవశాత్తు ఈరోజు మంగళవారం కావడంతో వందే భారత్ రైలు కూడా లేకపోవడంతో రెండు విమానాలు మారి విజయవాడ చేరాల్సి వచ్చింది. ఇది విశాఖ విమాన ప్రయాణికుల దుస్థితి" అంటూ గంటా శ్రీనివాసరావు వివరించారు.

## ఢిల్లీ, ముంబై రెడ్ జోన్‌లో ఉన్నాయి... ఢిల్లీలో మూడ్రోజులు ఉంటే జబ్బు ఖాయం

- మొదటి పేజీ తరువాయి

ఇవ్వాలని అన్నారు. పెట్రోల్, డీజిల్ కాలుష్యానికి ప్రధాన కారణమని పేర్కొన్నారు. వాహనాలలో ఉపయోగించే ఇంధనంలో మార్పు అవసరమని అన్నారు. భారతదేశం సుమారు రూ. 22 లక్షల కోట్ల విలువైన శిలాజ ఇంధనాలను దిగుమతి చేసుకుంటోందని గుర్తు చేశారు. వాటికి ప్రత్యామ్నాయ ఇంధనాలను వినియోగించాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకొని భారత్ ముందుకు సాగుతోందని అన్నారు. విద్యుత్, నీరు, కమ్యూనికేషన్ రంగాలలో ప్రపంచస్థాయి సదుపాయాలను కల్పించడంపై దృష్టి సారించిందని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాల లాజిస్టిక్ ఖర్చులు 12 శాతం లోపు ఉంటే మన ఖర్చులు 16 శాతం ఉన్నాయని అన్నారు. వచ్చే ఏడాది చివరి నాటికి మన ఖర్చులను సింగిల్ డిజిట్‌కు తగ్గించేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

## ఈ ఏడాది దేశంలో సాధారణం కంటే అధిక వర్షపాతం

- మొదటి పేజీ తరువాయి

ఐదు శాతం హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉందని పేర్కొంది. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు కొనసాగే ఈ రుతుపవనాల సీజన్‌కు సంబంధించిన వివరాలను భూ విజ్ఞాన శాస్త్ర మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఎం. రవిచంద్రన్ ఈరోజు ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు. సాధారణంగా 105 శాతం నుంచి 110 శాతం మధ్య వర్షపాతాన్ని 'సాధారణం కంటే ఎక్కువ' గా ఐఎండీ వర్గీకరిస్తుంది.అనుకూల వాతావరణ పరిస్థితులు ఈ అంచనాకు దోహదం చేస్తున్నాయని ఐఎండీ వివరించింది. రుతుపవనాల సీజన్ అంతటా ఎల్ నినో-సదరన్ ఆసిలేషన్ (ఈఎన్ఎస్ఓ), ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) వంటి కీలక వాతావరణ వ్యవస్థలు తటస్థంగా కొనసాగే అవకాశం ఉందని పేర్కొంది. అలాగే, 2025 ప్రారంభ నెలల్లో ఉత్తరార్ధగోళం, యూరేషియా ప్రాంతాల్లో మంచు తక్కువగా కప్పబడి ఉండటం కూడా రుతుపవనాల క్రియాశీలతను పెంచే మరో ముఖ్యమైన అంశమని తెలిపింది.సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుందన్న ఈ అంచనా దేశ వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా ఖరీఫ్ పంటల ఉత్పత్తికి గణనీయమైన మేలు చేస్తుందని భావిస్తున్నారు. ఇటీవలి కాలంలో నీటిమట్టాలు తగ్గిన జలాశయాలు తిరిగి పుంజుకునేందుకు ఇది దోహదపడుతుంది. సమృద్ధిగా కురిసే వర్షాలు ద్రవ్యోల్బణం తగ్గించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.వరుసగా పదో సంవత్సరం కూడా సాధారణం లేదా అంతకంటే ఎక్కువ వర్షపాతం నమోదవుతుండటం గమనార్హం. ఇది దేశ వాతావరణంలో కొంత స్థిరత్వాన్ని సూచిస్తోందని అధికారులు తెలిపారు. అయితే, దేశంలోని చాలా ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నప్పటికీ... లడఖ్, తమిళనాడు, ఈశాన్య రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. మొత్తంమీద, ఐఎండీ తాజా అంచనాలు దేశ ఆర్థిక వ్యవస్థకు, ముఖ్యంగా రుతుపవనాలపై ఆధారపడిన గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి సానుకూల సంకేతాలని చెప్పవచ్చు.

## అలా చేస్తే పాఠశాలల రిజిస్ట్రేషన్లు రద్దు చేస్తాం

- మొదటి పేజీ తరువాయి

పాఠశాలల్లో ఫీజుల పెంపును నిరసిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. మోడల్ టౌన్‌లోని క్వీన్ మేరీ స్కూల్ యాజమాన్యం విద్యార్థులను వేధింపులకు గురి చేసిందనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో పాఠశాల యాజమాన్యం కొందరు విద్యార్థులను బహిష్కరించినట్లు తెలుస్తోంది.ఈ విషయాన్ని తల్లిదండ్రులు ముఖ్యమంత్రి రేఖా గుప్తా దృష్టికి తీసుకురావడంతో ఆమె వెంటనే స్పందించారు. పాఠశాలల్లో ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం, విద్యార్థుల తల్లిదండ్రులను వేధించడం వంటి చర్యలను ఎంతమాత్రం సహించేది లేదని స్పష్టం చేశారు. ఫీజుల పెంపు విషయంలో పాఠశాలల యాజమాన్యాలు కొన్ని నియమ, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అసాధారణంగా ఫీజులు పెంచరాదని, విద్యార్థులను అకారణంగా వేధించరాదని హితవు పలికారు.నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. ప్రభుత్వానికి ఫిర్యాదులు వస్తే సంబంధిత పాఠశాలలకు నోటీసులు పంపిస్తామని తెలిపారు. అవసరమైతే రిజిస్ట్రేషన్లు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. పిల్లల హక్కులను కాపాడేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని పునరుద్ఘాటించారు. ప్రతి బిడ్డకు న్యాయం, గౌరవం, సరైన విద్య లభించాలన్నదే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. తల్లిదండ్రుల ఫిర్యాదుపై అధికారులు తక్షణమే స్పందించి దర్యాప్తు జరపాలని, నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు.

## ప్రభుత్వ కాలేజీల్లో చదివితే మార్కులు రావనే అపోహను మీరు చెరిపేశారు

- మొదటి పేజీ తరువాయి

"మీరంతా విజేతలు, మీకు నా హ్యాట్సాఫ్. ప్రభుత్వ కాలేజీల్లో చదివిన వారికి మంచి మార్కులు రావనే ముద్రను చెరిపేశారు. మీ అందరితో ఇలా కూర్చోవడం నా అదృష్టం. మిమ్మల్ని చూసి చాలా గర్వపడుతున్నా" అంటూ ఆయన తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. పేదరికం కారణంగా ఏ విద్యార్థి చదువుకు దూరం కాకూడదనేదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల మేరకు ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలను తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని రద్దు చేశారని, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని' పునరుద్ధరించడం వల్ల ఎంతో మంది పేద విద్యార్థులకు భారం తగ్గిందని మంత్రి గుర్తుచేశారు. తాను పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో కష్టపడి చదివానని, స్టాన్‌ఫోర్డ్‌లో ఎంబీఏ చేసి, ప్రపంచ బ్యాంకులో పనిచేశానని తన అనుభవాలను పంచుకున్నారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇంటర్ విద్యలో పాఠ్య, నోటు పుస్తకాల పంపిణీ, మధ్యాహ్న భోజనం పునరుద్ధరణ, ప్రిన్సిపాల్స్‌కు పదోన్నతులు వంటి అనేక సంస్కరణలు చేపట్టామని, చేయాల్సింది ఇంకా ఉందని తెలిపారు. జూన్ నాటికి విద్యాశాఖలో సంస్కరణలు పూర్తి చేసి, అభ్యాసన ఫలితాలపై (లెర్నింగ్ అవుట్‌కమ్స్) దృష్టి సారిస్తామని చెప్పారు. విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, వారిని చూసి అనేకమంది స్ఫూర్తి పొందాలని ఆకాంక్షించారు. "మీరంతా ఇప్పుడు ప్రభుత్వ విద్యకు బ్రాండ్ అంబాసిడర్లు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చు. 40 ఏళ్లలో ఎవరూ గెలవని మంగళగిరిలో నేను అనేక సవాళ్లను ఎదుర్కొని గెలిచాను. కష్టమైనా విద్యాశాఖను ఏరికోరి తీసుకున్నాను" అని అన్నారు. ఇంటర్ తర్వాత ఆసక్తి ఉన్న రంగాలను ఎంచుకోవాలని, కేవలం ఐటీ మాత్రమే కాకుండా సోలార్ ఎనర్జీ, బయో గ్యాస్ వంటి కొత్త రంగాల్లో అవకాశాలు అందిపుచ్చుకోవాలని సూచించారు. చిన్న చిన్న అపజయాలకు కుంగిపోకుండా లక్ష్య సాధనకు కృషి చేయాలని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. తల్లిదండ్రులు, గురువులను గౌరవించాలని, విలువలను ఎన్నడూ మర్చిపోవద్దని హితవు పలికారు.

## పవన్ 'కన్వర్టెడ్ సనాతని'

- మొదటి పేజీ తరువాయి

జనసేన అధినేత, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తీవ్ర విమర్శలు చేశారు. పవన్ కళ్యాణ్ ఒక 'కన్వర్టెడ్ సనాతని' అని ఆయన అభివర్ణించారు. ఎన్నికలకు ముందు తన వైఖరికి, ఎన్నికల్లో గెలిచి ఉప ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రదర్శిస్తున్న వైఖరికి మధ్య స్పష్టమైన తేడా ఉందని పేర్ని నాని ఆరోపించారు. పేర్ని నాని మాట్లాడుతూ, "ఎన్నికల ముందు వరకు తనకు అన్ని మతాలు, కులాలు సమానమే అని పవన్ కళ్యాణ్ చెప్పారు. కానీ ఎన్నికల్లో గెలిచి, డిప్యూటీ సీఎం అయిన తర్వాత ఆయన కాషాయ వస్త్రాలు ధరించి, తాను సనాతన ధర్మ పరిరక్షకుడినని ప్రకటించుకుంటున్నారు" అని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ అధికారికంగా ప్రకటించుకున్న 'కన్వర్టెడ్ సనాతని' అని నాని వ్యాఖ్యానించారు. గతంలో పవన్ కళ్యాణ్ బాప్టిజం తీసుకున్నారని, ముస్లిం మతాన్ని కూడా ఆచరించారని ఆరోపించిన నాని, ఇప్పుడు ఆ రెండింటినీ పూర్తిగా గాలికి వదిలేసి 'కన్వర్టెడ్ సనాతని'గా మారారని ఎద్దేవా చేశారు. "ఆయనే అధికారికంగా, సిగ్గు ఎగ్గు లేకుండా డిక్లేర్ చేసేశారు కదా. ఎన్నికల ముందేమో అన్ని మతాలు ఒకటే అన్నారు, గెలిచి పదవిలోకి వచ్చాక కాషాయ బట్టలు కట్టుకుని హార్డ్ కోర్ సనాతని, కన్వర్టెడ్ సనాతని అని ఆయనే చెప్పేశారు. కాబట్టి ఆయన్ని ప్రశ్నించడానికి ఏముంది?" అని పేర్ని నాని వ్యాఖ్యానించారు. పవన్ కళ్యాణ్ తన వైఖరిని తానే స్పష్టం చేశారని, దీనిపై ఇక చర్చ అనవసరమని నాని చెప్పారు.

## తమిళనాడు 'స్వయంప్రతిపత్తి' కోసం కీలక కమిటీ

- మొదటి పేజీ తరువాయి

స్వయంప్రతిపత్తిపై సూచనలు చేసేందుకు ఒక కమిటీని ఏర్పాటు చేశారు. స్వయంప్రతిపత్తి కోసం తీసుకోవాల్సిన చర్యలను ఆ కమిటీ సిఫార్సు చేయనుంది.పలు బిల్లుల ఆమోదంపై తమిళనాడు గవర్నర్, ప్రభుత్వానికి మధ్య విభేదాలు ఉన్నాయి. గవర్నర్ ఆమోదం లేకుండానే 10 చట్టాలను ప్రభుత్వం నోటిఫై చేసింది. ఈ బిల్లులపై సుప్రీంకోర్టులో సైతం స్టాలిన్ ప్రభుత్వానికి ఊరట లభించింది.

పెండింగులో పెట్టిన 10 బిల్లులు గవర్నర్ ఆమోదం పొందినట్టే భావించాలని భారత అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దీంతో వాటికి చట్టబద్ధమైన హోదా కల్పిస్తూ ప్రభుత్వం గెజిట్ విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తమిళనాడు ప్రభుత్వం స్వయంప్రతిపత్తిపై సూచనల కమిటీని ఏర్పాటు చేయడం గమనార్హం.

## పవన్‌కు అస్వస్థత... కేబినెట్ భేటీ ప్రారంభానికి ముందే వెళ్లిపోయిన డిప్యూటీ సీఎం!

- మొదటి పేజీ తరువాయి

అస్వస్థతకు గురయినట్లు తెలుస్తోంది. దాంతో ఆరోగ్యం సహకరించక సమావేశం ప్రారంభమయ్యేలోపే అక్కడి నుంచి క్యాంపు ఆఫీస్‌కి వెళ్లిపోయినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన క్యాంపు కార్యాలయంలోనే విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలోనూ జనసేనాని అనారోగ్యం వల్ల మంత్రివర్గ భేటీలకు గైర్హాజరైన విషయం తెలిసిందే.

# అంతర్జాతీయ విమానాశ్రయంకు అదనపు భూములు



## రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి అధ్యక్షతన మంత్రుల కమిటీ సమావేశం

**అమరావతి, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** రాష్ట్ర సచివాలయంలోని ఆర్థిక శాఖ మంత్రి కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక & ప్రణాళిక, వాణిజ్య పన్నులు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు పయ్యావుల కేశవ్ గారి ఆధ్వర్యంలో మంత్రుల కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సమావేశంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయంకు 500 ఎకరాల అదనపు భూములు కేటాయింపు సంబంధిత అంశాలను మంత్రుల కమిటీ చర్చించారు.

ఉత్తరాంధ్ర ఆర్థిక, సామాజిక, ఉపాధి రంగాల్లో మరింత పురోగ మించడానికి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం కేంద్రబిందువు కానుందని, అందుకు ప్రభుత్వ పరంగా నిర్మాణాత్మకమైన పనులు శరవేగంగా జరిగేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ సూచించారు. ఈ సమావేశంలో అనంతపురం జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రివర్యులు టీజీ.భరత్ తో కలిసి రాష్ట్ర రోడ్లు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతరకు పకడ్బందీగా ఏర్పాట్లు

- వైభవంగా శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర పత్రికల ప్రత్యేక పూజలు - ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ - జాతరకు భారీ విరాళం ప్రకటించిన డాక్టర్ కంచర్ల శ్రీకాంత్
- మే నెల 6న జాతర చాటింపు.. మే నెల 14 నుండి 21 వరకు జాతర కార్యక్రమాలు



**కుప్పం/పెన్ పవర్/ఏప్రిల్ 15 :** చిత్తూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కుప్పంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర ఆహ్వాన పత్రికల పూజా కార్యక్రమాన్ని ఆలయంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు, ఆలయ పూజారి సోమశేఖర శాస్త్రి ఆధ్వర్యంలో పూజారుల బృందం ఈ పత్రికల పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో ప్రభుత్వ విప్, కుప్పం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సమన్వయ కమిటీ చైర్మన్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ పాల్గొన్నారు. అలాగే జాతరకు గాను తనవంతుగా ఒక లక్ష 116 రూపాయలను విరాళంగా ప్రకటించారు.

అనంతరం శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర ఆహ్వాన పత్రికలను విడుదల చేశారు. మే నెల 6న జాతర చాటింపు: కుప్పంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమ్మ జాతర వివరాలను వెల్లడించారు. మే నెల ఆరవ తేదీన జాతర ఛాతింపు నిర్వహిస్తారు. అంతకుముందు దేవాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకం నిర్వహించారు. మే నెల 14వ తేదీ నుండి జాతర ప్రారంభమవుతుంది. 14వ తేదీ సాయంత్రం శ్రీ వినాయక స్వామి ఉత్సవంతో జాతర ప్రారంభం అవుతుంది. 15 తేదీ శ్రీ ప్రసన్న ముత్తు మారమ్మ ఉత్సవ ఊరేగింపు ఉంటుంది. 16 తేదీ శుక్రవారం అన్నదానం శ్రీ ప్రసన్న ముత్తు మారెమ్మ ఉత్సవ ఊరేగింపు ఉంటుంది. 17 తేదీ శనివారం ముత్తు మారెమ్మ ఉత్సవ ఊరేగింపు ఉంటుంది. 18 తేదీ ఉత్సవం ఊరేగింపు ఉంటుంది. 19 తేదీ సోమవారం అగ్నిగుండం, ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయి. 20 తేదీ మంగళవారం తిరుపతి గంగమ్మ శిరస్సు ఊరేగింపు ఉంటుంది. 21 వ తేదీ బుధవారం తిరుపతి గంగమ్మ విశ్వరూప దర్శనంతో జాతర ముగుస్తుంది. ఈ పత్రిక పూజా కార్యక్రమాలలో డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తో పాటు తెలుగుదేశం పార్టీ నాయకులు రాజ్ కుమార్, ,దామోదరం నాయుడు, ఆర్ఆర్ రవి, మంజునాథ్, ఉమాపతి నాయుడు, సోమశేఖర్, జాకీర్, ఫెస్టివల్ కమిటీ రవిచంద్రబాబు, శారదమ్మ ,నరేష్, సింధు రాజకుమార్, మంజుల మణి, సంతోషమ్మ జయరాం నాయుడు, మహేష్, వినాయకన్, వెన్నెల శరవణ, లక్ష్మి, జ్యోతిష్, వేద పండితులు ఈశ్వరం సోమశేఖర శాస్త్రి, ఆలయ పూజారుల బృందం, బిజెపి, జనసేన నాయకులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ఎలా ఉంటుందో ఈ 10 నెలల్లోనే చూపించా

- అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి
- నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే భూమి పూజ
- శారద నగర్, విజయనగర్ కాలనీలో బీటీ, సిసి రోడ్లకు భూమి పూజ
- గంగా నగర్ లో నూతన తాగునీటి పైప్ లైన్‌కు భూమి పూజ



**అనంతపురం పెన్ పవర్ ఏప్రిల్ 15 :** అనంతపురం అర్బన్ నియోజక వర్గంలో అభివృద్ధి ఎలా ఉంటుందో ఈ పది నెలల్లోనే చూపించామని అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. నగరంలోని పలు కాలనీల్లో మంగళ వారం సాయంత్రం ఆయన రోడ్డు నిర్మాణాలు, తాగునీటి పైప్ లైన్ లకు భూమి పూజ చేశారు. ముందుగా గంగానగర్‌లో మూడు లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన తాగునీటి పైపులైనుకు భూమి పూజ చేశారు. అనంతరం శారద నగర్ లో 56 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అలాగే విజయనగర్ కాలనీలో 28.50 లక్షలతో నిర్మిస్తున్న సిసి రోడ్డుకు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు. భూమి పూజలకు వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక ప్రజలు టిడిపి నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో ఎక్కడా రోడ్డు సమస్య లేకుండా చేస్తున్నామన్నారు. గత ఐదేళ్లలో ప్రజలు ఎన్నో సమస్యలు ఎదుర్కొన్నారని వీటన్నింటిని దశల వారీగా పరిష్కరిస్తున్నామన్నారు. రాష్ట్రం ఆర్థికంగా లోటులో ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అర్బన్ నియోజకవర్గ అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తున్నారు. నగరంలో ఎక్కడా డ్రైనేజీ, రోడ్డు తరువాయి 5లో..

## అసెంబ్లీ పద్దుల కమిటీ జిల్లాకు రాక : జిల్లా కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ఏప్రిల్ 16న ఒక రోజు పర్యటనలో భాగంగా అసెంబ్లీ పద్దుల కమిటీ జిల్లాకు విచ్చేయ నుందని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ పద్దుల కమిటీ ఛైర్మన్ జోగేశ్వర రావు తో పాటు 11 మంది సభ్యులతో కూడిన పద్దుల కమిటీ ఏప్రిల్ 16న ఉదయం తిరుపతి నుండి బయలుదేరి మధ్యాహ్నం 12.30 గం.లకు చిత్తూరు ఆర్ అండ్ బి అతిథి గృహం చేరుకుం టుందని, మ.2.00 గం.లకు జెడ్పి సమావేశ మందిరం లో సమీక్ష నిర్వహించి సాయంత్రం 5.30 గం.లకు రోడ్డు మార్గంలో తిరుమల బయల్దేరి వెళ్ళడం జరుగు తుందని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటన లో పేర్కొన్నారు. కమిటీ సభ్యులుగా శాసన సభ్యులు అఖిల ప్రియ భూమా, బండారు సత్యానంద రావు, జయకృష్ణ నిమ్మక, కందుల నారా యణ రెడ్డి, మద్దిపాటి వెంకట రాజు, పార్థసారథి వాల్మీకి, పాసిం సునీల్ కుమార్, ఏలూరి సాంబశివ రావు, ఎంఎల్‌సిలు పర్చూరి అశోక్ బాబు, డా.వరహ వెంకట సూర్య నారా యణ రాజు పెనుమస్త, వరుదు కళ్యాణిలు ఉండనున్నారన్నారు.

## అంగరంగ వైభవంగాబొమ్మవరం గ్రామంలో ఆలయ పునఃప్రతిష్ఠ





**అన్నమయ్య పెన్ పవర్ 15 :** శ్రీ పర్వతివర్ధనీ సమేత రామలింగేశ్వర స్వామి వారి ఆలయ పునః ప్రతిష్యా పూర్వక కుంభాభిషేక మహోత్సవం 2025, ఏప్రిల్ 11 నుండి 14వ తేదీ వరకు, అన్నమయ్య జిల్లా, ఓబులవారిపల్లి మండలంలోని బొమ్మవరం గ్రామంలో ఘనంగా నిర్వహించబడింది. శిఖర జీవధ్వజ, నవ గ్రహాల సమేతంగా ఆలయ పునఃప్రతిష్ఠ మహోత్సవం శ్రీశ్రీశ్రీ కాంచీ కామకోటి పీఠాధిపతి జగద్గురువులు శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి వారి దివ్య ఆశీస్సులతో భక్తి పరవశంలో సాగింది. ఈ పవిత్ర కార్యక్రమంలో లిరైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ పార్టీ ఇంచార్జి & KUDA చైర్మన్ ముక్కా రూపానంద రెడ్డిగారి సతీమణి ముక్కా వరలక్ష్మి ,పాల్గొని స్వామి, అమ్మవారి దివ్య దర్శనం చేసుకుని, పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనేక సంఖ్యలో భక్తులు ఈ మహోత్స వానికి హాజరై, తీర్థప్రసాదాలు స్వీకరించి, స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఎన్‌డిఏ కుటమి నాయుకులు పాల్గొన్నారు.

### ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ లబ్ధిదారులను గౌరవిస్తూ ...

# పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి






**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ లబ్ధిదారులను గౌరవిస్తూ పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలని, అలాగే పంపిణీ విషయంలో ఎలాంటి అవినీతికి, అక్రమాలకు తావు లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్‌లోని రెవిన్యూ భవనంలో జిల్లాలోని ఎన్టీఆర్ పెన్షన్ భరోసా పంపిణీ కార్యక్రమంలో పాల్గొనే పెన్షన్ పంపిణీ సిబ్బందితో ఐవిఆర్ఎస్ సంబంధించి అవగాహన కార్యక్రమాన్ని పాల్గొని వారికి జిల్లా కలెక్టర్ వారికి దిశ, నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల ప్రతిక్షణాత్మకంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపడు తున్నదని, దీనిని మరింత నాణ్యతతో, నిబద్ధతతో, ఎక్కడా అవినీతికి తావు లేకుండా పంపిణీ కార్యక్రమం చేపట్టాలని ఉద్దేశంతో చేపట్టడం జరిగిందని, దీనిని మన జిల్లాలో ఎక్కడ అవినీతికి అక్రమాలకు పాల్పడ కుండా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా చూడాలని, ఆ విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాల న్నారు. జిల్లాలో రూరల్ 31, అర్బన్ 6 మండలాలలో 5671 మంది పెన్షన్ డిస్బర్స్‌మెంట్ ఫంక్షనరీ పని చేసున్నారని, వీరు ప్రతినెల 2,81,588 మంది పెన్షన్ దారులకు నెలకు 124.73 కోట్లు లబ్ధిదారులకు ఇంటి వద్దనే ఇవ్వడం జరుగుతున్నదని, దీనిని మరింత పార దర్శకంగా లబ్ధిదారులకు చేరే తరువాయి 5లో..

# గిరిజన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించండి

### త్రాగు నీరు, రహదారి సౌకర్యాలను ఏర్పాటు చేయండి : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా



**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ప్రధానమంత్రి జన్మన్ క్రింద గిరిజన నివాసిత ప్రాంతాల్లో గుర్తించిన మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో ప్రధానమంత్రి జన్మన్ (ప్రధానమంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్), డా జుగా (ధర్తీ ఆబ జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్) పథకాల గుర్తించిన 11 అంశాలలో పురోగతిపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పిఓ ఐటిడిఎ వెంకట శివ ప్రసాద్, సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజ కుమారి మాట్లాడుతూ జిల్లాలోని 14 మండలాల్లో 48 గిరిజన నివాసీత ప్రాంతాల్లో పీఎం జన్మన్ కింద గుర్తించిన 11 అంశాలలో చేపట్టిన పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గూడెంలలో గృహ నిర్మాణాలకు సంబంధించి 527 ఇళ్లు మంజూరు కాగా వాటిలో కేవలం 92 మాత్రమే పూర్తి అయ్యాయని మిగిలిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ హౌసింగ్ పిడిని ఆదేశించారు. ఇంటి స్థలాలు కేటాయించిన వారికి తప్పనిసరిగా పొసెషన్ సర్టిఫికేట్ మంజూరు చేయాలని, సదరు సర్టిఫికేట్ ఉంటేనే రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న అదనపు ఆర్థిక సహాయం వచ్చే అవకాశం ఉంటుందని సదరు విషయాన్ని లబ్ధిదారులకు తెలియజేసి ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసేలా చూడాలన్నారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండేలా చూడాలన్నారు.

కొత్తపల్లిలో 38, పాములపాడులో 25, తదితర చెంచుగూడెంలలో 45 ఇళ్లు నూతంగా మంజూరు అయ్యాయని వాటిని కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కపిలేశ్వరం నుండి జానాలలగూడెం వరకు వేస్తున్న 7.11 కి.మీ బిటి రోడ్డును వెంటనే పూర్తి చేయాలని, అదే విధంగా రోడ్లు లేని గ్రామాలు ఏవీ ఉండకుండా ఉపాధి హామీ ద్వారా అనుమతులు తీసుకోవాలని కలెక్టర్ డ్వామా అధికారులను ఆదేశించారు. ఆర్వబ్ల్యూఎస్ కు సంబంధించి జల్ జీవన్ మిషన్ క్రింద పివిటిజిలకు త్రాగు నీరు ఇబ్బంది లేకుండా 53 పనులు మంజూరు చేయడం జరిగిందని అందులో 11 మాత్రమే పూర్తి అయ్యాయని మిగిలిన వాటిని కూడా వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆర్వబ్ల్యూఎస్ ఎస్ఈని ఆదేశించారు. అదే విధంగా సున్నిపెంట గ్రామంలో త్రాగునీటి అవసరాల కోసం ప్రభుత్వానికి రూ.2,813 కోట్లతో డిపిఆర్ పంపడం జరిగిందన్నారు. ప్రస్తుత వేసవి తీవ్రత దృష్ట్యా తక్షణ చర్య నిమిత్తం డిఎంఎఫ్ క్రింద 40 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. గిరిజన గూడెంలలోని గిరిజనులకు ఎప్పటికపుడు వైద్య సదుపాయాలు అందజేసేలా చూడాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పిఎంజెఎవై కార్డుల ద్వారా 5 లక్షల వరకు దేశంలో ఎక్కడైనా వైద్య సదుపాయం పొందే అవకాశం ఉంటుందని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవ ద్వారా 25 లక్షల వరకు రాష్ట్రంలో ఉచితంగా వైద్య చికిత్సలు పొందే అవకాశం ఉన్నందున చెంచుగూడెంలోకి ప్రజలు అందరికీ సదరు కార్డులు అందజేయాలని కలెక్టర్ జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు.

సమగ్రశిక్ష ద్వారా వెలుగోడులో వంద పడకలు, కొట్టాలచెరువులో 50 పడకల కస్తూరిబా పాఠశాలల వసతి గృహాలకు భూమి పూజ చేశామని సదరు వసతి గృహాలను రానున్న విద్యా సంవత్సరం నాటికి పూర్తి చేయాలని సమగ్రశిక్ష అధికారిని, పిఓ ఐటిడిఎను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా వసతి గృహం నుండి పాఠశాల ఎక్కువ దూరంలో ఉంటే రవాణా సదుపాయం ఏర్పాటు చేసేలా చూడాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి అవసరం ఉన్న చోట అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని అందుకు 3 నుండి 5 సెంట్లు స్థలాన్ని గుర్తించాలని, స్థల సేకరణ సంబంధించి ఎటువంటి సమస్యలు ఉంటే తహశీల్దార్లను తెలియజేయాలన్నారు. మార్కెటింగ్ కు సంబంధించి శ్రీశైలం ట్రైబల్ మ్యూజియం సమీపంలో మల్టీపర్పస్ మార్కెటింగ్ సెంటర్ ఏర్పాటు కోసం కోటి రూపాయలు మంజూరు కావడం జరిగిందని వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారిని కలెక్టర్ ఆదేశించారు. జనాలగూడెంలో విద్యుత్ లేకపోవడం వల్ల సుమారు 7 కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు వేసి గ్రామానికి విద్యుత్ సరఫరా చేసినందుకు కలెక్టర్ విద్యుత్ శాఖ అధికారిని అభినందించారు. మొబైల్ టవర్ల ఏర్పాటు కోసం కొత్తపల్లి మండలం, ఎర్రమట్టంలో స్థలం గుర్తించి బిఎస్ఎన్ఎల్ వారికి అందజేశారని, నాగలూటి, పెచ్చరువు ప్రాంతాల్లో ఎయిర్టెల్ వారు ఏర్పాటు చేసేందుకు అంగీకరించారని తగు చర్యలు తీసుకోవాలని ఐటిడిఎ పిఓను కలెక్టర్ ఆదేశించారు. డా జుగా (ధర్తీ ఆబ జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్) పథకం క్రింద ఆత్మకూరు మండలంలోని బైర్లూటిగూడెం, రాళ్ల కొత్తూరు గ్రామాలు, బనగానపల్లె మండలం గులమాలియాబాద్ తాండాలలలో గుర్తించిన 18 మౌలిక సదుపాయాలను త్వరితగతిన పూర్తి చేసి గ్రామాలను అభివృద్ధి చేయాలన్నారు. సివిల్ సప్లైస్‌కు సంబంధించి ఇంకా 166 గ్యాస్ కనెక్షన్లు పెండింగ్ లో ఉన్నాయని, వాటిని దీపం పథకం క్రింద అందజేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిఎస్ఓను ఆదేశించారు. వ్యవసాయానికి సంబంధించి ప్రకృతి వ్యవసాయంపై పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని తద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. పశు సంవర్ధక శాఖ ద్వారా లబ్ధిదారుల అర్హత మేరకు పశుసంపదను మంజూరు చేయడంతో పాటు పశుగ్రాసాన్ని సాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశు సంవర్ధక, డ్వామా పిడిని కలెక్టర్ ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో పోషన్ వాటికలు ఏర్పాటు చేసి వాటిలో మెడిసినల్ ప్లాంట్స్ ఏర్పాటు చేయాలన్నారు. అదే విధంగా చెంచుల్లో నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడానికి స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నైపుణ్య అభివృద్ధి అధికారిని కలెక్టర్ ఆదేశించారు.

# జాబ్ మేళాలను సద్వినియోగం చేసుకోండి

### పార్లమెంటు సభ్యులు, శాసనసభ్యులు పిలుపు





**చిత్తూరు, పెన్ పవర్, ఏప్రిల్ 15 :** రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడప్(SEEDAP) మరియు డి.ఆర్.డి.ఎ సంయుక్తంగా ఏప్రిల్ నెల 19వ తేదిన శనివారం స్థానిక ప్రభుత్వ పి.వి.కె.ఎన్.గవర్నమెంట్ డిగ్రీ (ఎ) కళాశాలలో నందు నిర్వహించే జాబ్ మేళాలని ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాద రావు, చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ పిలుపునిచ్చారు. ఈ జాబ్ మేళాలకు సంబందించిన గోడ ప్రతులను మంగళవారం చిత్తూరు పార్లమెంటు సభ్యులు, చిత్తూరు శాసనసభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇరువురు మాట్లాడుతూ ఈ నెల 19న శనివారం స్థానిక ప్రభుత్వ పి.వి.కె.ఎన్. గవర్నమెంట్ డిగ్రీ (ఎ) కళాశాలలో నందు నిర్వహించే జాబ్ మేళాలని ఉద్యోగ అర్హత కలిగిన యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ అవకాశాన్ని దాదాపు 20 కంపెనీలు 1000 ఖాళీలతో విచ్చేయుచున్నాయని,కనీస విద్యార్హత 10వ తరగతి నుండి డిగ్రీ ఫెయిల్/పాస్ అయిన 18 సంవత్సరాల నుండి 35 సంవత్సరాలు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి యం. గుణశేఖర్ రెడ్డి, పీవీ కెన్ కళాశాల ప్రిన్సిపాల్ డా. జీవన్ జ్యోతి, జిల్లా ప్లేసేమెంట్ అధికారి చైతన్య, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## "స్టాట్యూటరీ కమిటీ మీటింగ్" విక్టిమ్ కాంపెన్సేషన్ కేసులకు 10 లక్షల పరిహారం"



**కడప పెన్ పవర్ ఏప్రిల్ 15 :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా ఎల్ వెంకటేశ్వరరావు కడప మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మరియు ఇంచార్జ్ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు మరియు కడప సీనియర్ సివిల్ జడ్జి కె ప్రత్యూష కుమారి, న్యాయ సేవా సదన్ కడప నందు "స్టాటిటరీ కమిటీ మీటింగ్" నిర్వహించడం జరిగింది. ఈ స్టాట్యూటరీ కమిటీ మీటింగ్‌లో విక్టిమ్ కాంపెన్సేషన్ నంబర్:1/2023 కేసుకు ఐదు లక్షల పరిహారం, 3/2024 కు ఐదు లక్షలు పరిహారం నిర్ణయించడం జరిగింది. 2/2024 కేసు రిజెక్ట్ చేయడం జరిగినది కారణం ఏమనగా మోటార్ వెహికల్ ఆక్సిడెంట్ కేసు కావున. అంతేకాకుండా ఈ కమిటీ ఆగస్టు 2024 నుండి మార్చి 2025 వరకు రివ్యూ వర్క్, లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారం, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ నందు కేసుల పరిష్కారాలు తదితర అంశాలను చర్చించారు. ఈ కార్యక్రమంలో కడప అడిషనల్ సూపర్డెంట్ ఆఫ్ పోలీస్, కడప డిస్టిక్ రెవెన్యూ అధికారి, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి, రాయచోటి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కడప గవర్నమెంట్ ప్లీడరు, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, స్టాట్యూటరీ కమిటీ మెంబర్లు పాల్గొన్నారు.

## "కడప రిమ్స్ ఆవరణంలో ఉన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ విజిట్, న్యాయ విజ్ఞాన సదస్సు"



**కడప పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు కడప నగరం రిమ్స్ ఆవరణంలో ఉన్న ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌ను విజిట్ చేసి న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ (నల్సా) వారి మానసిక అనారోగ్యం ఉన్న వ్యక్తులు మరియు మేధో వైకల్యాలున్న వ్యక్తులకు చట్టపరమైన సేవలు పథకం 2024ను ప్రవేశపెట్టినది, ఆరోగ్యానికి మించిన ఆస్తి లేదు, మానసిక ఆరోగ్యం సంరక్షణ చట్టం 2017, జాతీయ మానసిక ఆరోగ్య విధానం 2014, మానసిక వ్యక్తుల కోసం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి, మందులను సకాలంలో వాడి వ్యాధి తీవ్రతను తగ్గించుకోవాలి, పరిసరాలను, జీవన పరిస్థితులు, భద్రత, భద్రత ఆరోగ్యం, పరిశుభ్రత ఆహారం మరియు మౌలిక సదుపాయాలను, వార్డులను ప్రత్యేకంగా పరిశీలించారు. తగు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. లీగల్ సర్వీసెస్ హెల్ప్ లైన్ నెంబర్ 15100, చైల్డ్ లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098, దివ్యాంగజన్ హెల్ప్ లైన్ నెంబర్ 14456, ఉచిత న్యాయ సహాయము, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టము మొదలగు అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ సూపరిండెంట్ డాక్టర్ వెంకట రాముడు, డాక్టర్లు వంశీకృష్ణ సురేష్, సాహిద్ భాష, సుబ్రహ్మణ్యం, లక్ష్మీనారాయణ, మనోబంధు ఫౌండేషన్ రీజినల్ కోఆర్డినేటర్ శివారెడ్డి, మనోబంధు ఫౌండేషన్ అడ్వైజర్ మెంబర్ డాక్టర్ శ్రీనివాసులు, సిబ్బంది మరియు మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వ్యక్తులు పాల్గొన్నారు.

## వేసవి కోచింగ్ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ (SAAP) రాష్ట్రవ్యాప్తంగా 1300 వార్షిక వేసవి కోచింగ్ శిబిరాలను (ప్రతి శిబిరంలో 25 మంది బాలురు & 25 మంది బాలికలు) నిర్వహించాలని ప్రతిపాదించింది. ఈ శిబిరాలు ప్రతి జిల్లాలో 50 మంది కోచింగ్ శిబిరాల్లో 65,000 మంది ఆటగాళ్లను కలిగి ఉంటాయని, 2025-26 సంవత్సరానికి 26 జిల్లాల్లోని గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో మే 1 నుండి 31 వరకు 2500 మంది ఆటగాళ్లను కలిగి ఉంటాయని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ వారి ఆదేశాల మేరకు 2025 సంవత్సరానికి మే నెల 1 నుండి 31వ తేది వరకు వార్షిక వేసవి కోచింగ్ శిబిరాల నిర్వహణ కొరకు గుర్తించబడిన కోచింగ్ శిబిరాలు, పేదికలను మన చిత్తూరు జిల్లాలో నిర్వహించుటకు గాను అసక్తి గల పి.డి., పి.ఇ.టి. క్రీడా అసోసి యేషన్ వారి నుండి దరఖాస్తు కోరడమైనదని, 2025-26 సంవత్సరానికి వార్షిక వేసవి కోచింగ్ శిబిరాలను నిర్వహించడం వెనుక ప్రధాన లక్ష్యం 08 నుండి 14 సంవత్సరాల వయస్సు గల పిల్లలను క్రమం తప్పకుండా శిక్షణ కోసం అకర్షించడం మరియు చిన్న వయస్సులోనే ప్రతిభావంతులైన పిల్లలు/క్రీడాకారులను గుర్తించడం, వేసవి సెలవులను ఉపయోగించుకోవడం ద్వారా క్రీడలను కొనసాగించడానికి వారిని ప్రేరేపించడం మరియు చాలా చిన్న వయస్సులోనే ఆరోగ్యకరమైన జీవనశైలిని నిర్వహించడం, ఎందుకంటే వేసవి సెలవులు వివిధ విభాగాలలో పిల్లలు వారి ప్రతిభను గుర్తించి వేసవి శిబిరాలకు హాజరు కావడానికి పిల్లలను ఆకర్షించడానికి వీలవుతుందని మరియు పెద్దలు ఈ విషయంను గమనించి పిల్లల ఆసక్తులను గుర్తించి వేసవి శిభిరాలకు పంపాలని ఈ క్రీడలు ఉదయం 6 నుండి 9 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి 7 గంటల మధ్య జరుగునని, కావున ప్రతి పేరెంట్స్, స్టూడెంట్స్ సదవకాశంను వినియోగించుకోవాలని ఎ.బాలాజీ, జిల్లా క్రీణాభివృద్ధి అధికారి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ, చిత్తూరు వారు ఒక ప్రకటనలో తెలియపరిచారు. క్రీడా శిబిరాలు నిర్వహించ దలచే వారు 17-04-2025 సాయంత్రం 5 గంటల లోపు (పి.డి., పి.ఇ.టి. క్రీడా అసోసియేషన్ మరియు సీనియర్ ప్లేయర్స్) దరకాస్తు చేసుకోవాలని కోరారు.

## శ్రీకాళహస్తి గవర్నమెంట్ హాస్పిటల్లో ఆర్ఓ ప్లాంట్ ప్రారంభం



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 15 :** శ్రీకాళహస్తి ప్రభుత్వ హాస్పిటల్లో మంగళవారం స్థానిక ఎమ్మెల్యే సిద్ది రెడ్డి చేతుల మీదుగా ఆర్వో ప్లాంట్ ప్రారంభించారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 75వ జయంతి పురస్కరించుకొని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి చేతుల మీదుగా ఈ ప్లాంట్ను ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్కు వచ్చే రోగుల సౌకర్యార్థం పరిశుభ్రమైన నీటిని అందించడం జరుగుతుందన్నారు.

## కూలీలకు నిర్బంధ వెట్టిచాకిరీ నుండి విముక్తికి చర్యలు చేపట్టండి : జిల్లా కలెక్టర్



**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** జిల్లాలో నిర్బంధ వెట్టిచాకిరీకి బలౌతున్న కూలీలకు విముక్తి కలిగించడానికి చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో నిర్బంధ వెట్టిచాకిరీ కూలీ విధానం నిర్మూలనపై జేసి జి.విద్యాధరితో కలసి సంబంధిత అధికారులు, రోప్స్ స్వచ్ఛంధ సంస్థ ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిర్బంధ వెట్టి చాకిరీ విధానం పౌల్ట్రీ, పరిశ్రమలు, ఇటుకల తయారీ ప్రాంతాలలో చాలా వరకు అమలవుతున్నదని, దీని కారణంగా ఆర్థిక, శ్రమ దోపిడితో ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. అటువంటి వారిని గుర్తించడానికి ఆర్డిఓలు డివిజన్ స్థాయిలో తహాశీల్దార్లకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 1976 నిర్బంధ కూలీ విధానం నివారణ చట్టంను పక్కాగా అమలు చేయాలని సూచించారు. కార్మిక శాఖ, డిఆర్డిఏ, డ్వామా, జెడ్పి సిఈఓ, తదితర అధికారులు క్షేత్ర స్థాయి పరిశీలనకు వెళ్ళిన తరుణంలో ఆకస్మి కంగా తనిఖీలు నిర్వహించి నిర్బంధ కూలీలని గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వెట్టిచాకిరీ, మానవ అక్రమ రవాణా ఒక నేరం అంశాలకు సంబంధించి గోడ పత్రికలు, కర పత్రాలను జిల్లా కలెక్టర్ జేసి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మానికి జెడ్పి సిఈఓ రవికుమార్ నాయుడు, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ ఓంకార్, డిపిఓ సుధాకర్ రావ్, డిఎం అండ్ హెచ్ఓ డా.సుధారాణి, నెహ్రూ యువజన కేంద్రం కొ ఆర్డినేటర్ ప్రదీప్ కుమార్, డిటిడబ్ల్యుఓ మూర్తి, చిత్తూరు ఆర్ డి ఓ శ్రీనివాసులు, డిఆర్డిఏ పిడి శ్రీదేవి, రోప్స్ సంస్థ ఛైర్మన్ ధనశేఖర్, ప్రోగ్రాం హెడ్ శాం జెబాదుర్రై, ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



## పారదర్శక ఓటరు జాబితా : రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్





**చిత్తూరు, పెన్ పవర్ ఏప్రిల్ 16 :** పారదర్శకమైన ఓటరు జాబితా తయారీకి అధికార యంత్రాంగం చర్యలు చేపడుతున్నదని జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా సచివాలయంలోని డిఆర్ఓ సమావేశ మందిరంలో జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో డిఆర్ఓ సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ పారదర్శక ఓటర్ల జాబితా తయారీకి ఈఆర్ఓలు, ఏఆర్ఓలు, బిఎల్ఓలు చర్యలు చేపడుతున్నారని, ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల సలహాలు, సూచనలను పరిగణలోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతున్నదని, మరణించిన వారి ఓటును కుటుంబ సభ్యులకు నోటిస్ అందించి తొలగిస్తున్నామన్నారు. ఒక ఓటరు రెండు నియోజకవర్గాలలో ఓటు హక్కు కలిగి ఉన్నట్లు గుర్తించినట్లైతే బిఎల్ఓల ద్వారా తగిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ స్టేషన్‌ల రేషనలైజేషన్ చర్యలు చేపడుతున్నామన్నారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా 6665 ఓటర్లను తొలగించడం జరిగిందని, ఇందులో 642 మంది ఓటర్లు మరణించారని, 5588 మంది ఓటర్లు వలస వెళ్లారని,435 మంది ఓటర్లు పునరావృతం అయినట్లు గుర్తించామని తెలిపారు.

ఈ సమావేశానికి వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులైనటి టిడిపి ప్రతినిధి వి.సురేంద్ర కుమార్, బిజెపి ప్రతినిధి అట్లూరి శ్రీనివాసులు, వైఎస్ఆర్ సిపి ఎన్. ఉదయ్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి బాల సుబ్రహ్మణ్యం, సిపిఎం ప్రతినిధి వి గంగరాజు, ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ పరదేశి మరియు ఎలక్షన్ సెక్షన్ సూపరింటెండెంట్ వాసుదేవన్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అధిక ఉష్ణోగ్రతల వల్ల వివిధ ఉద్యాన తోటల సంరక్షణ





**తిరుపతి పెన్ పవర్ ఏప్రిల్ 15 :**

**తీసుకోవలసిన జాగ్రత్తలు :**

**మామిడి :**

1)ప్రస్తుతం కాయలు వివిధ దశల్లో ఉండటం వల్ల తగినంత నీటి యాజమాన్యం చేపట్టాలి.

2)10 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ వయసున్న మామిడి తోటల్లో బిందు సేద్యం ద్వారా నాలుగు నుంచి ఐదు గంటలు నీటిని అందించాలి.

3)పండ్లకు కవర్లు కడితే వేడి నుంచి రక్షించుకోవచ్చు.

4)చెట్ల పాదులకు పంట వ్యర్థాలతో ఆచ్ఛాదన (సేంద్రీయ మల్చ్) ఏర్పాటు చేయాలి.

5)పొడి వాతావరణంలో తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉంటుంది కాబట్టి నివారణకు అసిఫేట్1.5 గ్రాములు లేదా ఫిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లు లేదా స్పైనో సైడ్ 0.3 మిల్లీ లీటరు లేదా ఎక్సోనస్ 0.2 మిల్లీలీటర్లు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.

**కొబ్బరి :**

1)పూత, కాత వస్తున్న చెట్లకు సుమారు 50 నుండి 60 లీటర్ల నీటిని అందించాలి.

2)సర్పిలాకార తెల్ల దోమ ఉధృతి వేసవికాలంలో అధికంగా ఉంటుంది దీని నివారణకు వేప నూనె 10000 పిపిఎం రెండు మి.లీ ఒక లీటర్ నీటికి కలిపి ఆకులు బాగా తడిచేలా పిచికారి చేయాలి.

3)10 నుండి 15 రోజులు తర్వాత ఈసారియా, ఫ్యూమారోజియా అనే జీవశిలీంధ్ర నాశనిని ఆకుల కింది భాగం తడిచేలా పిచికారి చేస్తే పురుగు ఉధృతిని సమర్థవంతంగా నివారించవచ్చు.

4)పంట వ్యర్థాలను మల్చింగ్‌గా వాడి నేలలోని నీటి తేమను కాపాడాలి.

**టమాట :**

1)అధిక ఉష్ణోగ్రతలు, వేడి గాలుల కారణంగా కాయలు పండ్లలో పగుళ్లు వస్తాయి ఎండ దెబ్బ తగలడం వల్ల నాణ్యతలేని పండ్ల దిగుబడి వస్తుంది.

2) ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో టమాటాలో ఆకుముడత తెగులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది నీడనిచ్చే వస్త్రాలతో షేడ్ నెట్ లను ఏర్పాటు చేసుకుంటే మొక్కలకు సూర్యకాంతి పడటం తగ్గుతుంది మరియు నేల, గాలి ఉష్ణోగ్రత తగ్గుతుంది.

## వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దండి

### జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్



**నంద్యాల, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** జిల్లాలో వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస పథకాన్ని క్షేత్రస్థాయిలో సక్రమంగా అమలు చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి రాము నాయక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని డిఆర్ఓ ఛాంబర్ లో ఉల్లాస్ కార్యక్రమంపై జిల్లా స్థాయి కమిటీ కన్వర్జెన్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి రామునాయక్ మాట్లాడుతూ మొదటి విడతలో 26,785 మంది వయోజన నిరక్షరాస్యులలో 23,861 మంది అక్షరాసులుగా తీర్చిదిద్ది పరీక్షలు నిర్వహించగా 23,224 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. రెండవ విడతలో 30,443 వయోజన నిరక్షరాస్యులను అక్షరాలను అక్షరాసులుగా తీర్చిదిద్దేందుకు లక్ష్యాన్ని నిర్దేశించారన్నారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో స్వయం స్వయం సహాయక సంఘాల పరిధిలోని వయోజనులను అక్షరాసులుగా చేసేందుకు విద్యనభ్యసించిన గ్రూప్ లీడర్లను గుర్తించి నియమించాలని డిఆర్డిఏ పిడిని సూచించారు. వయోజన విద్య ఉపసంచాలకులు చంద్ర శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక బృందం (ఎస్.హెచ్.జి) సభ్యులు, వంట సహాయకులు, వాచ్మెన్, ప్రభుత్వ సహాయక పాఠ శాలలు, అంగన్వాడీ సహాయకులు/ ఆయాలు మరియు ఎన్ఆర్ఈజిఎస్ కార్మికులలో క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. కొన్నిచోట్ల మహిళలు సంతకం పెట్టలేని పరిస్థితి ఆయా సంఘాల్లో ఉందని... సంబంధిత వ్యక్తులు సంతకం పెట్టేలా, చదవగలిగేలా విద్యను బోధించాలని తెలిపారు. రెండవ విడత ఉల్లాస్ కార్యక్రమం కింద ఈనెల 16వ తేదీ నుంచి ఆరు రోజులపాటు సర్వే మొదలు పెట్టి నిరక్షరాస్యులను గుర్తించాల్సి ఉందని, సర్వే చేపట్టడంపై దృష్టి పెట్టాలన్నారు. మే 5వ తేదీ నుంచి సెప్టెంబర్ వరకు అక్షరాస్యత నేర్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమం ఐదు నెలల పాటు 200 గంటల వ్యవధిలో రోజుకు 2 గంటల పాటు అమలు అయ్యేలా రూపొందించబడిందన్నారు. అంగన్ వాడి కేంద్రాలు, కమ్యూనిటీ సెంటర్లను సాయంత్రం రెండు గంటల పాటు అక్షరాస్యత కేంద్రాల కోసం వినియోగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఉల్లాస్ కార్యక్రమాన్ని సజావుగా, విజయవంతంగా అమలు చేయాలని ఆయా శాఖల అధికారులను డిఆర్ఓ ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్డీఏ పిడి శ్రీధర్ రెడ్డి, డిపిఓ జమిఉల్లా, డిఎల్డిఓ శివారెడ్డి, మెప్మా మేనేజర్ రాములు, డీఈఓ జనార్దన్ రెడ్డి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి

### - జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**అనంతపురం, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** జిల్లాలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. మంగళవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో ఉల్లాస్ కార్యక్రమం కింద జిల్లా స్థాయి కమిటీ కన్వర్జెన్స్ మీటింగ్‌ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఉల్లాస్ కార్యక్రమం కింద స్వయం సహాయక బృందం (ఎస్.హెచ్.జి) సభ్యులు, వంటవారు, సహాయకులు, ప్రభుత్వ రాత్రి వాచ్మెన్, ప్రభుత్వ సహాయక పాఠశాలలు, అంగన్వాడీ సహాయకులు/ఆయాలు మరియు ఎన్ఆర్ఈజిఎస్ కార్మికులలో క్రియాత్మక అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత మరియు డిజిటల్ అక్షరాస్యత సాధించడంపై దృష్టి సారించి ఈ కార్యక్రమం విమాత్నంగా అమలు చేయబడుతోందన్నారు. 2025-26లో జిల్లాలో మొత్తం 35,286 మందికి సాక్షరత తీసుకురావాలని లక్ష్యం నిర్దేశించడం జరగగా, అందుకు అనుగుణంగా లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కొన్నిచోట్ల మహిళలు సంతకం పెట్టలేని పరిస్థితి ఆయా సంఘాల్లో ఉందని, వారు సంతకం పెట్టేలా, చదవగలిగేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అడల్ట్ ఎద్యుకేషన్ డిడి ఆంజనేయులు, డీఆర్డీఏ పిడి ఈశ్వరయ్య, డిపిఓ నాగరాజునాయుడు, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో వెంకటసుబ్బయ్య, మెప్మా పిడి విశ్వజ్యోతి, ఐ&పీఆర్ డిఐపిఆర్ఓ గురుస్వామిశెట్టి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం





**నాయుడుపేట, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 15 :** అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉందని నాయుడుపేట అగ్నిమాపక కేంద్రం ఇంచార్జ్ డివి రమణయ్య అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా మంగళవారం నాయుడుపేట పట్టణంలోని బస్టాండు రైల్వే స్టేషన్ ప్రాంతాల్లో నాయుడుపేట అగ్నిమాపక కేంద్రం ఇంచార్జ్ డివి రమణయ్య ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్యాస్ సిలిండర్లు లీకై అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను డెమో ద్వారా చేసి వివరించారు. చిన్న చిన్న జాగ్రత్తలు పాటించడం ద్వారా అగ్నిప్రమాదాలు నివారించవచ్చని ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట అగ్నిమాపక కేంద్రం లీడింగ్ ఫైర్ మాన్ అమరావతి చంద్రబాబు, ఫైర్‌మెన్‌లు ఏ.సందీప్, ఎం.నాగరాజు, కే.పోలయ్య, హెచ్.బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

### స్వర్గీయ బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా

## నివాళులర్పించిన బొజ్జల కుటుంబీకులు



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 15 :** బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా ఊరందూరు గ్రామంలో వారి స్వగృహంలో వారి చిత్రపటానికి నివాళులర్పించి అనంతరం బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, బొజ్జల హరినాథ్ రెడ్డి, సమాధుల వద్ద నివాళులర్పించిన బొజ్జల కుటుంబం.

## పోషకాహారం తీసుకోవడం తప్పనిసరి



**సదుం/పెన్ పవర్/ఏప్రిల్ 15 :** గర్భవతులు, చిన్నపిల్లలు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని సిడిపిఓ మల్లీశ్వరి అన్నారు. మంగళవారం సదుం గ్రామపంచాయతీ బట్టువారి పల్లె అంగన్వాడీ కేంద్రంలో పోషకాహార పక్షోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భవతులు గర్భస్థ సమయంలో తీసుకోవాల్సిన పోషకాహారం దాని వలన ప్రయోజనాలు, రక్తహీనత నివారణ, పిండం ఎదుగుదల, అవయవాలు ఎదుగుదల, సుఖ ప్రసవం, వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ తరపున వడదెబ్బ నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఓఆర్ఎస్ ద్రావణం తయారీ దానివలన ప్రయోజనాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగమణి, ఆరోగ్య పర్యవేక్షక సిబ్బంది జానకి, శిఖామణి, నీలకంత, ఉపాధ్యాయుడు కృష్ణమూర్తి, ఆరోగ్య కార్యకర్త హేమలత, ఆశా కార్యకర్త మల్లేశ్వరి, అంగన్వాడి కార్యకర్తలు గర్భవతులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ లబ్ధిదారులను గౌరవిస్తూ ...

## పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టాలి

(3వ పేజీ తరువాయి) విధంగా ఇలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పెన్షన్ లబ్ధిదారులకు నేరుగా ఐవిఆర్ఎస్ ద్వారా లబ్ధిదారులకు నేరుగా ఫోన్ ద్వారా మాట్లాడటం జరుగుతుందని, వారి అభిప్రాయాలను సేకరించడం జరుగుతున్నదన్నారు. పెన్షన్ పంపిణీ చేసే సమయంలో పెన్షన్ లబ్ధిదారుల పట్ల పెన్షన్ పంపిణీ సిబ్బంది ఎక్కడ ఎలాంటి అవినీతికి పాల్పడకుండా ఉండాలని, వారి ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ పంపిణీ చేయాలని, పెన్షన్ పంపిణీ చేసే సమయంలో వారిని మర్యాదపూర్వకంగా, గౌరవంగా మాట్లాడి పెన్షన్ పంపిణీ చేయాలన్నారు. పెన్షన్ల పంపిణీలో అవినీతి పాల్పడిన, వారి ఇంటి వద్దకు వెళ్లకుండా వారిని పిలిపించుకొని పెన్షన్ పంపిణీ చేసిన, అమర్యాదగా వారితో ప్రవర్తించిన అటువంటి వారిపై ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ఐవిఆర్ఎస్ ద్వారా లబ్ధిదారునికి నేరుగా మాట్లాడి వారి అభిప్రాయాన్ని తెలుసుకోవడం జరుగుతున్నదని, కావున ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా పారదర్శకంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి ఈశ్వరయ్య, డిపిఎం సత్యనారాయణ, ఏపీ అజ్మతుల్లా, పెన్షన్ పంపిణీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి ఎలా ఉంటుందో ఈ 10 నెలల్లోనే చూపించా



(3వ పేజీ తరువాయి) సమస్య లేకుండా చేసేందుకు ఇప్పటికే చాలా పనులు చేశామన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న వాటిని రానున్న రోజుల్లో చేయనున్నట్లు వివరించారు. ఇందుకోసం బడ్జెట్ కూడా ప్రత్యేకంగా కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబుని కోరామన్నారు. పది నెలల్లోని ఇంత అభివృద్ధి చేస్తుంటే ఇంకా వైసీపీ నాయకులు విమర్శలు చేయడం సరైనది కాదన్నారు. వారు విమర్శలు మాని ఆత్మ విమర్శ చేసుకోవాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## ఘనంగా రాము గుప్తా జన్మదిన వేడుకలు



**శ్రీ కాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 15 :** ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి లిరాము గుప్తాలి జన్మదిన సందర్భంగా శ్రీకాళహస్తి మెడికల్ అసోసియేషన్ సభ్యుల సమక్షంలో ఘనంగా లిజన్మదిన వేడుకలులి జరిగాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ సభ్యులైనఆనంద్ గుప్తా, అమరా జనార్ధన్ రావు, మధు సూదన్ రావు, కొండేటి గోపాల్, కార్తీక్ రెడ్డి, చరణ్, ప్రకాష్, శ్రీనివాసులు, నెహ్రూ, నరేష్, చక్రపాణి, సూర్య, బద్రి నారాయణ, శివ, జ్ఞాన సాయి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బ శోకకుండా జాగ్రత్తగా ఉండండి

- పంచాయతీ కార్యదర్శి జయశంకర్



**సోమల/పెన్ పవర్/ఏప్రిల్ 15 :** మండల పరిధిలోని గ్రామీణ ప్రజలు వ్యవసాయ కూలీలు రైతులు ఎండలలో తిరిగితే వడ దెబ్బ సోకుతుందని, వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్య దర్శి జయశంకర్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ వేసవికాలంలో ఉపాధి హామీ కూలీలు, రైతులు ఉదయం 10:30 వరకు అనంతరం సాయంకాలం నాలుగున్నర గంటల పైనే పొలం పనులకు వెళ్లాలన్నారు. మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం నాలుగు గంటల వరకు ఇండ్ల వద్ద గాని, చెట్ల నీడన గాని ఉండాలన్నారు. పశువుల కాపరులు కూడా ఇదే సమయాన్ని పాటించి పశువులు, గొర్రెలు మేతకు తీసుకెళ్లాలన్నారు. అత్యవసరమైతే తప్ప ఎండ సమయంలో ఇళ్ల నుండి బయటకు వెళ్ళరాదని ఒకవేళ ఎవరైనా వడదెబ్బకు గురైతే మొదటగా వారికి ఓఆర్ఎస్ ద్రావణం అందిస్తే ప్రమాదం నుండి బయటపడతారన్నారు. ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు మహిళా ఆరోగ్య కార్యకర్త, ఆశా కార్యకర్త, అంగన్వాడీ కార్యకర్తల వద్ద ప్రతి ఒక్కరు ఉచితంగా పొందవచ్చు అన్నారు. అనంతరం వారిని సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి గాని లేదా ప్రభుత్వ ఆసుపత్రికి గాని 108 ద్వారా తరలించాలన్నారు. ఆసుపత్రిలో వారికి ఎలాంటి ప్రాణ హాని జరగకుండా చికిత్సలు ఉచితంగా అందిస్తారని తెలిపారు.

## "అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్"



**కడప పెన్ పవర్ ఏప్రిల్ 15 :** రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశానుసారంగా ఎల్.వెంకటేశ్వరరావు కడప మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి, ఇంచార్జ్ చైర్మన్-కం-జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ, కడప వారి సూచనల మేరకు ఎస్.బాబా ఫక్రుద్దీన్, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కడప వారు న్యాయ సేవా సదన్ కడప నందు "అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్" నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ U/Sec.436A CrPC/479 BNSS అర్హత కలిగిన UTPల గురించి చర్చించడానికి, మొదటిసారి నేరం చేసి, శిక్షలో మూడింట ఒక వంతు పూర్తి చేసి, సెక్షన్ 479 BNSS ప్రకారం అర్హత కలిగిన UTPల కోసం చర్యల గురించి చర్చించడానికి, కోర్టు ద్వారా బెయిల్ మంజూరు చేయబడిన UTPల గురించి చర్చించడానికి, కానీ పూచీ కత్తులను సమర్పించలేకపోయిన, కాంపౌండబుల్ నేరాలకు పాల్పడిన UTPల గురించి చర్చించడానికి, U/Sec.436 CrPC/478 BNSS అర్హత కలిగిన UTPల గురించి చర్చించడానికి ఈ కార్యక్రమంలో కడప అడిషనల్ సూపరిడెంట్ ఆఫ్ పోలీస్, కడప డిస్టిక్ రెవెన్యూ అధికారి, రాయచోటి రెవెన్యూ డివిజనల్ అధికారి, రాయచోటి సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, కడప చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, కడప పురుషుల కేంద్ర కారాగారము సూపరిడెంట్, ప్రత్యేక మహిళా కారాగార సూపరిడెంట్, డిస్టిక్ సబ్ జైలు అధికారి పాల్గొన్నారు.

## జిల్లాలోని ప్రతి ఒక్కరికీ ఉద్యోగ అవకాశాలు : జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్

యువతీ యువకులకు ఉపాధి అవకాశాలను, జాబ్ మేళా నిర్వహించి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తాం : ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి





**తిరుపతి, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ప్రతి నియోజకవర్గం లోని యువతీ, యువకులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారని, అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, శాసనసభ్యులు, శ్రీకాళహస్తి నియోజకవర్గం వారి యొక్క సహాయ సహకారాలతో మెగా జాబ్ మేళా నిర్వహించడం జరిగిందని తెలిపారు. మంగళ వారం శ్రీకాళహస్తి నియెజకవర్గంలోని సంబయ్యపాలెం, ఎస్ ఎస్ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన మెగా జాబ్ మేళా కార్యక్రమంలో ఎం.ఎల్.ఏ బొజ్జల సుదీర్ రెడ్డి, నరసింహ యాదవ్, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్, ఆంధ్రప్రదేశ్, ఆర్ డిఓ భాను ప్రకాశ్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో సాయంత్రం ముఖ్య అతిథులుగా గౌరవ ఎస్పీ, ఎమ్మెల్యే చేతుల మీదుగా ఈ మెగా జాబ్ మేళాలో సెలెక్ట్ అయినటువంటి వారందరికీ ఆఫర్ లెటర్స్‌ని అందించి శుభాభినందనలు తెలియజేశారు.

ఈ జాబ్ మేళాకి 1824 మంది హాజరవుగా, 719 మంది వివిధ కంపెనీలకు సెలెక్ట్ అయ్యి, అలాగే 325 మంది షార్ట్ లిస్ట్ అవడం జరిగింది. ఈ కార్యక్రమంలో రవీంద్రనాథ్, ఎంపీడీవో, తొట్టంబేడు, రఫీ ఖాన్, ఎంపీడీవో శ్రీకాళహస్తి మండలం, వెంకటరమణ, ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, తాసిల్దార్ శ్రీకాళహస్తి, ఆర్.లోకనాథం, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి, ఏపీ ఎస్ఎస్‌డిసి, గ్రామ వార్డు సచివాలయ సిబ్బంది, ఏపీ ఎస్ఎస్‌డిసి, సిబ్బంది, స్థానిక ప్రజా ప్రతినిధులు, నాయకులు మరియు వివిధ కార్పొరేషన్ చైర్మన్లు వార్డ్ మెంబర్స్, శ్రీ కాళహస్తి నియోజకవర్గం నిరుద్యోగ యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి కార్యకర్తలారా సహనం కోల్పోకండి

- ఇలాంటి అవాకుచవాకులకు భయపడకండి - వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి



**పెళ్లకూరు, పెన్ పవర్ ప్రతినిధి, ఏప్రిల్ 14 :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చిల్లకూరు గ్రామం నందు వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి తన నివాసంలో మీడియా సమావేశంనిర్వహించారు. కామిరెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై సోషల్ మీడియాలో అనేక రకములైన అసభ్యకరమైన ఫోటోలు, వీడియోలు చిత్రీకరిస్తున్నారు. మా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కూడా అనేక రకములైన ఫోటోలు, వీడియోలు చిత్రీకరించారు. కానీ మా నాయకుడు ప్రజాస్వామ్య హక్కులను, శాంతి భద్రతను కాల రాయకూడదుఅనే ఉద్దేశంతోఎవరిని ఇబ్బంది పెట్టకుండా మంచి మార్గాల ద్వారా ఎవరి మీద కేసులు పెట్టకుండా రావడం జరిగింది. కానీ ఇప్పుడు అయిదు సంవత్సరాల క్రితం జరిగిన సజ్జల రామకృష్ణ, సజ్జల భార్గవి రెడ్డి, అదేవిధంగా వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ప్రతినిధుల, నాయకుల మీద పోసాని కృష్ణ మురళి పై కేసులు కడుతున్నారు. కేసు ఒకటైన అనేక స్టేషన్లో పెట్టి అక్కడ కోర్టులను తిప్పుతూ బెయిల్ ఇవ్వకుండా ఇబ్బంది పెట్టడం ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితులు చూసిన తర్వాత ఇప్పుడు జరుగుతున్న మాజీ సీఎం పై అసభ్యకరమైన వీడియోలు పోస్టులు పెట్టిన వారిపై మా నాయకుడిని అసభ్య పదజాలంతో మాట్లాడిన వారిపై మా నాయకుడు జగన్మోహన్ రెడ్డికి సంబంధం లేకుండా మేము కూడా కేసులు పెడుతున్నాం. ముఖ్యమంత్రికి, మంత్రికైన సామాన్య పౌరునికైనా న్యాయం చేయడం రాష్ట్ర పోలీస్ శాఖపై కోర్టులపై నమ్మకంతో న్యాయం చేస్తారు. ఉద్దేశంతో కేసులు పెట్టడం జరుగుతుంది. న్యాయం చేయని పక్షంలో హైకోర్టును ఆశ్రయిస్తాం అని అన్నారు. ఫేస్బుక్ ఐడీలలో కూడా జగన్మోహన్ రెడ్డి కించపరుస్తూ వాట్సాప్‌లో చేయడం ఒక మహిళను కూడా చూడకుండా మాజీ ముఖ్యమంత్రి సతీమణి వైయస్ భారతిని కించపరచడం చాలా దారుణం అన్నారు. వైఎస్ఆర్సిపి సోషల్ మీడియా ఉత్సాహంగా దూసుకుపోతుంది అనే దురుద్దేశంతో దాన్ని అడ్డుకోవడం కోసం సజ్జల భార్గవ్ రెడ్డిపై కేసులు పెట్టి భయ భ్రాంతులకు గురి చేస్తున్నారు. ఇప్పటికీ సూళ్లూరుపేట నియోజకవర్గంలో జగన్మోహన్ రెడ్డి పై వస్తున్న పోస్టులపై నాలుగు కేసులు పెట్టడం జరిగింది అన్నారు. ఇలాంటి అవ్వకు చావాకులకు అసపకరమైన పోస్టులు పోస్టులతో జగన్మోహన్ రెడ్డి ని తన సైన్యాన్ని ఏమి చేయలేరని అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పోలం రెడ్డి శేఖర్ రెడ్డి, జడ్పిటిసి నన్నం ప్రిస్కిల్లా, వైస్ ఎంపీపీ సుధారాణి, రోసనూరు ఎంపీటీసీ సుజాత, కలవకూరు ఎంపీటీసీ సునీత, తాలూయపాడు సర్పంచ్ కుమారి కల్పన, పెన్నేపల్లి సర్పంచ్ కుదిరి లక్ష్మి,పెళ్లకూరు మండల వైఎస్ఆర్సిపి మహిళా అధ్యక్షురాలు పిల్ల శైలజ, యాళ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## అరచేతితో సూర్యుడిని ఆపలేరు.. బీజేపీలోకి చేరికల ఆపలేరు..

- నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ హరీష్ బాబు



**ధర్మవరం రూరల్ పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ధర్మవరం మండలంలోని చిన్నూరు బత్తలపల్లి గ్రామానికి చెందిన గడుపుటి నాగభూషణం ఆధ్వర్యంలో, ధర్మపురి మాజీ సర్పంచ్ వెంకటరాముడు మరియు మాజీ సర్పంచ్ పులమరాజుల గారు వారి అనుచరులతో కలిసి మంగళవారం భారతీయ జనతా పార్టీ (బీజేపీ)లో చేరారు. వీరికి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు గారు పార్టీ కండువా కప్పి గౌరవంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీష్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గారి బలమైన నాయకత్వంలో ధర్మవరం నియోజకవర్గం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ఈ అభివృద్ధి చూసి ఆకర్షితులైన గడుపుటి నాగభూషణం, వెంకటరాముడు, పులమరాజులు తమ అనుచరులతో కలిసి బీజేపీలో చేరడం ఎంతో హర్షకరం అని తెలిపారు. అలాగే, అరచేతితో సూర్యుడిని ఆపలేని విధంగా, బీజేపీలోకి ప్రజలు వేలం వేలుగా చేరడాన్ని ఎవరూ ఆపలేరు అని ధీమా వ్యక్తం చేశారు. కొత్తగా పార్టీలో చేరిన నాయకులకు, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. పార్టీలో పార్టీలో ఈ విధమైన చేరికలతో ధర్మవరం నియోజకవర్గంలో బీజేపీ మరింత బలోపేతం కానుందని హరీష్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ అధ్యక్షులు గొట్లూరు చంద్ర, రూరల్ మాజీ అధ్యక్షులు భక్తవత్సలా నాయుడు, నేలకోట రామ్మోహన్, మైనార్టీ నాయకులు నబి రసూల్, బోయ చిన్న లింగమయ్య, బోయ గంగాధర్, పోతుకుంట రాజు, ఏకిల లక్ష్మీనారాయణ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార పక్షోత్సవాలు



**చంద్రశేఖరపురం, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ఏడవ పౌష్టికాహార పక్షోత్సవాల్లో భాగంగా ఈ రోజు చంద్రశేఖరపురం మండల కేంద్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ వెలిగండ్ల వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి యల్. బ్రహ్మయ్య మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని పరిశుభ్రమైన ఆహారం అందించాలని, పోషణ పక్వాడ న్యూట్రి గార్డెన్ కార్యక్రమాలు పోషహార లోపాన్ని తగ్గించ డానికి ప్రజలకు పోషకాహారం గురించి అవగాహన కల్పించాలని తెలిపారు. డాక్టర్ ద్యుతి మాట్లాడుతూ స్త్రీ గర్భం దాల్చిన రోజున నుండి వెయ్యి రోజులు తల్లి పిల్లలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి మరియు కమ్యూనిటీలోని వ్యక్తుల ఆహారపు అలవాటులో మార్పు రావాలని పోషక ఆహార లోపం ఉన్న పిల్లలను గుర్తించి వారిని ఎన్నార్సికు పంపించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే లబ్ధిదారులు సొంతగా పేరు నమోదు చేసుకునే విధంగా సాంకేతిక పరిజ్ఞానం గూర్చి వివరించారు పరిశుభ్రతపై అవగాహన కల్పించడంతో పాటు శిశువుల్లో ఇన్ఫెక్షన్ నివారించ డానికి చేతులు కడుక్కోవడం, హ్యాండ్ వాష్ పద్ధతులు మరియు రక్తహీనత గురించి తల్లులకు వివరించాలని తెలిపారు. అలాగే అంగన్వాడి కేంద్ర పరిధిలోని ప్రతి లబ్ధిదారుల పేర్లు మొబైల్ యాప్ లో నమోదు చేయాలని తెలియజేశారు. మండల విద్యాశాఖ అధికారులు కొండారెడ్డి, ప్రసాదరావు మాట్లాడుతూ విద్యలో జరిగే మార్పులకు అనుగుణంగా ప్రతి అంగన్వాడి కార్యకర్త బోధన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని కోరారు. బోధన శిక్షణ కార్యక్రమాలను ప్రభుత్వం నిర్వహిస్తారని తెలియజేశారు. తదుపరి తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు కలిగిన ఆహారమును తయారుచేసి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బ్రహ్మయ్య, పీహెచ్సీ డాక్టర్ ద్యుతి, ఎంఈఓ కొండారెడ్డి మరియు ప్రసాద్ రావు క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు మాలకొండయ్య, ప్రాజెక్టు కోఆర్డినేటర్ గంధం సామ్యూల్, వెలుగు ఏపియం లక్ష్మీనారాయణ, సెక్టార్ యాక్టివ్వూ పర్వైజర్లు సరళ రెడ్డి, రజిని ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన

## డాక్టర్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై చర్యలు!!

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి




**కడప పెన్ పవర్ ఏప్రిల్ 15 :** కడప నగరంలోని హోమియోపతి వైద్య కళాశాలలో చదువుతున్న విద్యార్థినిపై అసభ్యకరంగా ప్రవర్తించిన ప్రభుత్వ అసిస్టెంట్ ప్రొఫెసర్ క్రిమినల్ కేసు నమోదు చేయాలని మంగళవారం కడప నగరంలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు విద్యను, మంచి లక్షణాలను బోధించాల్సిన ప్రొఫెసర్ విద్యార్థినీలపై ఫోటో మార్కింగ్ చేసి ఒక అమ్మాయికి ఫోటో పెట్టి అసభ్యకరంగా ప్రవర్తించి ఎవరికైనా చెప్తే మీ మార్కులను తగ్గిస్తాం , ఎగ్జామ్లలో ఫెయిల్ చేస్తామని వేధింపులకు గురి చేస్తున్న మణికంఠ అనే అసిస్టెంట్ ప్రొఫెసర్ దుర్మార్గానికి దిగ దారడం దారుణమన్నారు. జరిగిన సంఘటన వారం అవుతున్న ఆ విద్యార్థిని ఆయనపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినప్పటికీ అతని మీద ఇంకా చర్యలు తీసుకోకపోవడం వెనకాల రహస్యమేమిటో అర్థం కావడం లేదు. ఇంత జరుగుతున్న మందలించాల్సిన ప్రిన్సిపల్ సాంబశివమూర్తి ఆయనకు వత్తాసు పలుకుతూ చేస్తూ కళాశాలను,విద్యార్థుల జీవితాలతో చలగాటం వాడుతున్నారు. భవిష్యత్తులో ఇలాంటివారు విద్యార్థులు విద్యకు దూరం అయ్యే అవకాశం ఉందని ఉన్నతాధికారులు వెంటనే దీనిపైన చర్యలు తీసుకోవాలని, అతన్ని తక్షణం విధులనుంచి తప్పించి విచారణ జరిపించాలని కోరుచున్నాము లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. కడప నగర ఉపాధ్యక్షులు శ్రీనివాసులు నగర్ నాయకులు ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి దేవాలయం ప్రత్యేక దృష్టి

- నియోజకవర్గ ఇన్‌ఛార్జి హరీష్



**ధర్మవరం పెన్ పవర్ ఏప్రిల్ 15 :** ధర్మవరం పట్టణంలో మే 14వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభం కానున్న అయ్యప్ప స్వామి దేవాలయ మహోత్సవాన్ని పురస్కరించుకొని, ఆలయం పరిసర ప్రాంతాల్లో అవసరమైన ఏర్పాట్లపై అధికారులు కృషి ప్రారంభించారు. ఈ రోజు ఉదయం ఆలయ కమిటీ సభ్యులు శ్రీ బి.వి. ప్రకాష్ గారు, పి.జె. విజయ్ కుమార్ (గురు స్వామి) గారు కలిసి మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు గారిని కలిసి వివిధ అభివృద్ధి అంశాలపై విజ్ఞప్తి చేశారు. ఆలయానికి వెళ్లే రహదారి మరమ్మత్తు, వీధిదీపాల నిర్వహణ, కాలువల శుభ్రత, అదనపు విద్యుత్ లైటింగ్ ఏర్పాటు వంటి అంశాలపై తక్షణమే స్పందించిన హరీష్ బాబు గారు, మునిసిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ గారితో కలిసి స్వయంగా ఆలయ ప్రాంగణాన్ని సందర్శించారు. ఆలయం అభివృద్ధి పనులు, భద్రతా చర్యలు, తాగునీటి సౌకర్యాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవాలయ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించే దిశగా మున్సిపల్, విద్యుత్, పోలీస్, ఆరోగ్యశాఖల మధ్య సమన్వయంతో ఏర్పాట్లు చేపడతామని హామీ ఇచ్చారు. మే 14న అయ్యప్ప స్వామి ఆలయం ప్రారంభోత్సవం సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు హాజరవుతారని అంచనా వేయబడింది. అందుకు అనుగుణంగా అన్ని విభాగాల్లో పనులను వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## మెగా జాబ్ మేలకు విశేష స్పందన



**శ్రీకాళహస్తి, పెన్ పవర్, ప్రతినిధి, ఏప్రిల్ 15 :** స్వర్గీయభద్ర గోపాలకృష్ణ రెడ్డి జయంతి సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా జాబ్ మేళా. జాబ్ మేళా నిర్వహించుటకు దగ్గరుండి అన్ని ఏర్పాట్లు చేసిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఉదయం జాబ్ మేళా ను తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు రాష్ట్ర యాదవ్ సంఘ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్ గారితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దాదాపు 2000 మంది నిరుద్యోగులు జాబ్ మేళాలకు హాజరయ్యారు దాదాపు 1000 మందికి ఉద్యోగాలకు ఎంపికవ్వడం జరిగింది. జిల్లా ఎస్పీతో కలిసి ఉద్యోగ నియామక పత్రాలు అందించిన శ్రీ కాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు మా నాన్న జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన ఈ జాబ్ మేళా నాకు ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది ఇంత మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం చాలా సంతోషంగా ఉందని అదేవిధంగా ఇన్ని కంపెనీలు శ్రీకాళహస్తి నియోజకవర్గం లో స్థాపించడం బొజ్జల గోపాలకృష్ణ రెడ్డి కృషి అని తెలియజేసారు, మా తండ్రి జయంతి సందర్భంగా ప్రతి సంవత్సరం జాబ్ మేళా నిర్వహిస్తానని తెలిపిన ఎమ్మెల్యే బొజ్జల తెలిపారు.

### మెరిట్ విద్యార్థులను అందరూ ప్రోత్సహించాలి : పొదిలి ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్

**పొదిలి, పెన్ పవర్, ఏప్రిల్ 15 :** మెరిట్ విద్యార్థులను ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని పొదిలి ఎక్సైజ్ మరియు ప్రొహిబిషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ టి అరుణ చెప్పారు తమ కార్యాలయంలో పనిచేస్తున్న షేక్ మస్తాన్ భాష కుమారుడు హబీబ్ అహమ్మద్ భాష స్థానిక వీరిశెట్టి కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతూ 470 మార్కులకు గాను 463 మార్కులు సాధించి, రాష్ట్రంలో నాల్గవ ర్యాంకు సాధించడం జరిగింది. ఈ సందర్భాన్ని పునస్కరించుకొని మంగళవారం నాడు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో సి ఐ అరుణ విద్యార్థి హబీబ్ అహ్మద్ ను ప్రత్యేకంగా అభినందించారు అలాగే సీఐ అరుణ విద్యార్థి హబీబ్ అహ్మద్‌కు కేక్ తినిపించి తమ ఆనందాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో పొదిలి ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ సైమన్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దశాబ్దాలుగా జరగని అంబేద్కర్ భవన నిర్మాణం కోసం సహకరించండి

### - ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం



**పలమనేరు ఏప్రిల్ 15, (పెన్ పవర్) :** దశాబ్దాలుగా జరగని అంబేద్కర్ భవన నిర్మాణం కోసం సహకరించాలని ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పుష్పరాజ్,జయరామయ్య లు మాట్లాడుతూ.. పలమనేరు పట్టణములోని దండుమిట్ట వద్ద అంబేద్కర్ భవన నిర్మాణం కోసం గత ప్రభుత్వాలు 46సెంట్ల స్థలాన్ని కేటాయించి, నిధులు కూడా విడుదల చేసి వదిలేశారన్నారని ఆరోపించారు. నియోజకవర్గ పరిధిలో దాదాపు 31వేల మంది ఎస్సీ,ఎస్టీలు ఉన్నారని, తమ కులస్తులకు పలు కార్యక్రమాలు, వివాహాది శుభకార్యాల కోసం ప్రత్యేక భవనం లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని,కావున ఈ భవన నిర్మాణం కోసం ప్రభుత్వం తరపున నిధులు విడుదల చేసేలా చొరవ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్‌కు విన్నవించామని అన్నారు.ఈ విషయం పై జాయింట్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఇందులో సంఘం సభ్యులు నాగయ్య, రవి, లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

## అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన





**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు ఏప్రిల్ 15 :** అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా మంగళవారం స్థానిక ఆర్టీసి బస్ గ్యారెజ్ నందు పనిచేయు సిబ్బందికి ఆయిల్స్ వలన అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఏ విధంగా నివారించాలో అగ్నిమాపక అధికారి కె.శ్రీకాంత్ రెడ్డి మాక్ డ్రిల్ నిర్వహించి అవగాహన కల్పించారు. బస్సుల్లో అగ్ని నిరోధక పరికరాలను ఉంచుకోవలసినదిగా సూచించారు. బస్టాండ్ ఆవరణంలో ఉన్న ప్రయాణికులకు అగ్ని ప్రమాదం జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ప్రచురించిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ డి.శ్రీనివాసులు, గ్యారేజ్ ఇంచార్జ్ ఎస్. విజయ సిబ్బంది పాల్గొన్నారు. తదుపరి సి ఎం ఆర్ షాపింగ్ మాల్ నందు పనిచేయు సిబ్బందికి, కొనుగోలుదారులకు కరపత్రాలు పంచి అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అనంతరం రైల్వే స్టేషన్ లో పనిచేయు స్టేషన్ మాస్టర్, సిబ్బందికి, ప్రయాణికులకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన తెలియపరిచే కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.శ్రీనివాసులు రెడ్డి, ఒంగోలు అగ్నిమాపక కేంద్ర సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగవైభవంగా నెమలిగుండ్ల రంగడి రథోత్సవం



**గిద్దలూరు పెన్ పవర్ ఏప్రిల్ 15 :** నలమల్లగిరుల్లో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం నెమలిగుండ్ల రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజు సోమవారం రాత్రి స్వామి వారి రథోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. ఈ నెల 12న ప్రారంభ మైన వార్షిక బ్రహోత్సవాలు 14తో ఘనంగా ముగిశాయి. ఈ ఏడాది బ్రహోత్సవాలు ఎమ్మెల్యే ముత్తుముల అశోకరెడ్డి ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరిగాయి. 13న నెమలిగుండ్ల రంగడి కల్యాణం కంనీయంగా, కన్నులపండువు నిర్వహించారు. 14 న కళ్యాణమూర్తుల తెప్పోత్సవం నెమలిగుండంలో అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తుల గోవిందనాంస్మరణల మధ్య నెమలిగుండ్ల గుండంపుష్కరిణిలో రంగడు దేవేరులు ఇరువురు తో కలిసి విహరించారు. ఇది ఇలాఉండగా అదేరోజు సోమవారం నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఇరువురు దేవేరులతో కలసి రథంలో వేంచేసి నలమల్ల గిరుల్లో విహరించారు. నలమల్ల గిరుల్లో నెమలిగుండ్ల రంగడి రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. భక్తుల గోవిందా నామస్మరణలు భాజభజంత్రీల మోత్తలు, కోలాటం , కులుకుభజనలు ,లాంటి సాంస్కృతిక , ప్రధానంగా స్వామికి ప్రీతికరమైన అగ్నిసేవ విన్యాసాల మధ్య రథోత్సవం సాగింది. స్వామివారి రథం లాగేందుకు భక్తులు పోటీపడ్డారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోకరెడ్డి పాల్గొని స్వామి వారిని ఆలయం వద్ద నుంచి రథశాలవరకు మోసుకునివచ్చి అలంకరించిన రథంలో వేంచేపచేశారు. రథోత్సవం ముందు అర్చకులు సంప్రదాయం ప్రకారం జరగాల్సిన తంతు జరిపించినతరువాత రథోత్సవం ప్రారంభమయింది. దీంతో నలమల్ల గిరుల్లో ఆధ్యాత్మిక శోభసంతరించుకుంది .నలమల్ల విద్యుత్ దీపకాంతులతో స్వామివారికి సాధారణంగా వెలిగించే కాగడల వెలుగులు విరచిమ్ముతూ ఉండగా వెదపండితుల వేదపార యాణం , భక్తుల ఆధ్యాత్మిక ఆనందానికి అవధులు లెవనిచెప్పాలి. భక్తుల సందోహంతో నలమల్ల గిరులు సుడులు తిరిగాయి. ఈ ఉత్సవంలో స్వామివారికి ప్రీతిపాత్రమైన అగ్గి సేవ విన్యాసాలు అబ్బురపరచాయి.

## పోషకాహారాన్ని ప్రోత్సహించడమే పోషణ్ పక్వాడ లక్ష్యం : జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య













**కర్నూలు, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** పిల్లలు, మహిళలకు ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడమే పోషణ్ పక్వాడ లక్ష్యం అని జాయింట్ కలెక్టర్ డా. బి.నవ్య తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో జిల్లా స్థాయి పోషణ పక్వాడ కార్యక్రమని నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు, ముఖ్యంగా గర్భవతులు, పాలిచ్చే తల్లులు వారి ఆరోగ్యం పట్ల వహించాల్సిన శ్రద్ధ, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన సరైన చర్యలు గురించి అవగాహన కల్పించడమే పోషణ పక్వాడ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. జిల్లా, మండల స్థాయిలో ఈ కార్యక్రమాలను మరింత ఎక్కువగా నిర్వహించాల్సిన బాధ్యత మన పై ఉందన్నారు.. గర్భవతులు రక్తహీనతకి గురి కాకుండా అవసరమైతే ఐరన్ ఫోలిక్ యాసిడ్‌ను సప్లిమెంట్‌గా తీసుకోవాలన్నారు. అదే విధంగా ట్రైమెస్టర్‌లో తీసుకోవాల్సిన ఇంజెక్షన్ సరైన సమయానికి చేయించుకోవాలన్నారు. డెలివరీ అయిన తర్వాత 3 నెలల వరకు పిల్లలకు తల్లి పాలు ఇవ్వాలని, సంవత్సరం లోపల ఉండే పిల్లలకు ఆరోగ్యపరంగా తీసుకోవాల్సిన విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. 0 నుండి 5 సంవత్సరాల వయసు ఉన్న పిల్లలు చాలామందికి బర్త్ సర్టిఫికెట్లు లేవని, ఆరోగ్యశాఖ ఐసిడిఎస్ శాఖ సమన్వయంతో కలిసి పనిచేసి బర్త్ సర్టిఫికెట్ లేని పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ లు ఇప్పించే విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు... అంగన్వాడి కేంద్రాల్లో ప్రీ ప్రైమరీ కి వచ్చే పిల్లలకు బర్త్ సర్టిఫికెట్ ఉందో లేదో వెరిఫై చేయాలన్నారు.. అదే విధంగా గర్భవతుల రిజిస్ట్రేషన్ పోర్టల్ లో రిజిస్టర్ అయిన వారికి సర్టిఫికెట్ అందిందో లేదో కూడా వెరిఫై చేసుకోవాలని కలెక్టర్ డి ఎం హెచ్ ఓ ను ఆదేశించారు. ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ ఆర్జెడి రోహిణి మాట్లాడుతూ తల్లులు తమ పిల్లలని శక్తి వంతులుగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. డిఎంహెచ్ఓ శాంతి కళ మాట్లాడుతూ గర్భవతులు మరియు బాలింతల కు కావలసిన ఐరన్ సప్లిమెంట్లు, టీకాలు, మందులు, ఆరోగ్య సూచనలు ఆశా వర్కర్లు , ఏఎన్ఎం ల ద్వారా తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని తెలియజేశారు. అంగన్‌వాడి కేంద్రాల ద్వారా సరఫరా చేసే ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. తల్లిపాల ఆవశ్యకతను తెలుసుకొని పిల్లలకు 6 నెలల దాకా తల్లిపాలు తప్పక ఇవ్వాలని సూచించారు. వెయ్యి రోజులు వరకు పిల్లలను వారి పెరుగు దల ను నిశితంగా గమనించాలని అవసరమైతే వైద్యులను సంప్రదించాలని కోరారు. అంతకుముందు మిల్లెట్ లతో తయారు చేసిన పౌష్టిక ఆహార పదార్థాల ప్రదర్శన స్టాల్స్‌ను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. అనంతరం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గర్భిణీలకు సామూహిక సీమంతాల కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఓ సి.వెంకట నారాయణమ్మ, సిడిపీఓలు తదితరులు పాల్గొన్నారు.

# మనం అందరం కలిసికట్టుగా ఉండలేమా?




### పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి

**కడప పెన్ పవర్ రాయలసీమ కోఆర్డినేటర్ ఏప్రిల్ 15 :** ఈ మిషన్ ఇలా చేస్తే బాగుంటుంది, ఫలానా సోదరులు అలాటివారు అన్న మన వ్యక్తిగత అహంకారాలను, వ్యక్తిగత కోరికలను మరిచిపోయి, మనందరమూ కలసికట్టుగా నిలబడితే తప్ప, ఈ సంస్థ అభివృద్ధి చెందదన్న విషయం మనందరికీ" జీవితమంతా తెలిసినా, తిరిగి దానిని కనుక్కోవడానికి 30 సంవత్సరాలు సంస్థ పట్టింది. దీనివల్ల నాకర్థమైందేమిటంటే,ఆ స్థలాల్లో ఉన్న మిగిలిన సోదరీ సోదరులకు మనము ఇంకా,మరింతగా సేవను అందించలేకపోవడమే! ఈ సంస్థ మానవాళికి సేవ చేయడానికే తప్ప, తనంతట తన కోసమే దీనికి ఉనికి లేదు. అందువల్లనే, మనము ఇతర దేశాలకు వెళ్ళి, బాబూజీ మహరాజ్ ఉద్దేశించిన విధంగా, ఆయా దేశాల ప్రజలకు మన సేవలను అందిస్తున్నాము. కానీ, ప్రజలు సంఘాలుగా ఏర్పడి, పరిస్థితిని రాజకీయం చేసి, మనకు మనమే భిన్నంగా విడిపోయేటట్లుగా చేస్తే, ఇది దివ్యమైన సహజ మార్గ సిద్ధాంతాలను తిరస్కరించడమే అవుతుంది. ఇది మన సత్సంగాలలో, మన సమూహాలలో, బాబూజీ చెప్పినట్లుగా ఉండవలసిందిగా సోదర భావమన్న ఒకే ఒక సూత్రాన్ని అత్యంత విచారంతో, దుఃఖంతో విడచి పెట్టడమే అవుతుంది. "స్నేహము అని మీరు ఎందుకు చెప్పడంలేదు?" అని నేను ఒకసారి వారిని అడిగాను.

"నేను సోదరభావమని ఎందుకంటున్నానంటే, సోదరుల మధ్య సాధారణంగా స్నేహమన్నది ఉండదు.

సోదరీ, సోదరులందరూ, ప్రేమతో, స్నేహంతో. ఐకమత్యంతో ఉండడాన్ని నేను చూడదలచుకున్నాను" అని వారు చెప్పారు.

నీవు ఫలానా ప్రాంతాలని గాని, ప్రజలని గానీ పేరు పెట్టదలచుకోలేదు. కానీ, కనపడని, నా వేలు ఎవ్వరివైపు దీనిని చూపిస్తున్నదో ఇక్కడున్న మీ అందరికీ తెలిసిన విషయమే. దానికి పెద్ద తెలివితేటలు అవసరం లేదు. ఎందుకంటే, మనము సహకరిస్తున్నామో. లేదా అన్న విషయము మనలోని ప్రతి ఒక్కరికీ తెలుసు. మనలో విరుద్ధమైన అభిప్రాయాలు ఉంటే, దాని అర్థం మనము సహకరించడం లేదనే. "అలా కాదు, బాబూజీ ఇలా చెప్పారు, ఆయన చెప్పింది ఇది..." అని ఎప్పుడయితే అంటారో, దాని అర్థం ప్రతికూల వివాదాలు, అభిప్రాయాల భిన్నత్వం ఉన్నాయనే. ఎప్పుడయితే మనము, "కాదు, కాదు, నేను ఇలాగా, నేను అలాగా, నీవు ఇలాగా, నీవు అలాగా ఉన్నావు" అని అంటామో, మరలా అక్కడ సహకార రాహిత్యము, విభిన్నత్వము, విరోధము ఉన్నట్లే.

చూశారా! అమెరికా సంయుక్త రాష్ట్రాలలోని ఒక మహత్తరమైన లక్షణమేమిటంటే, అక్కడి ప్రజలు అనేకమైన జాతుల వంశమూలాలు, విభిన్నమైన సంస్కృతులు, భాషలనుండి వచ్చినప్పటికీ, వారందరూ అమెరికన్లయినందువలన, వారు అమెరికా దేశానికి చెందినవారే.

మన సంస్థ కూడా అలా ఉండాలనుకుంటే, మనందరమూ కూడా సహజమార్గీయులుగా ఉన్నప్పుడే అది సాధ్యమవుతుంది. మనము ఎక్కడైనా జన్మించి ఉండవచ్చు. మనము విభిన్నమైన మతాలలో పుట్టి ఉండవచ్చు. ఇలా చేస్తే బాగుంటుందన్న అభిప్రాయాలు మనందరికీ ఉండవచ్చు. కానీ, ఒకే గురువు మార్గదర్శకత్వంలో, ఒకే పద్ధతిని, మార్గదర్శక సూత్రాలను ఉపయోగిస్తూ, సాధారణత్వాన్ని కలిగిన ఒక సముదాయంగా ఒకే గమ్యాన్ని చేరాలని మనము ఆకాంక్షిస్తున్నప్పుడు, మనకున్న వ్యక్తిగత అభిప్రాయాలు మనకు ఆకాంక్షిశిస్తున్నప్పుడు, మనకున్న వ్యక్తిగత అభిప్రాయాలు మనకు అడ్డుపడకూడదు.అలా జరగకపోతే,మనం ఎక్కడికి పోతున్నట్టు? నేను మిమ్ములను ఎంతమాత్రమూ పొగడదలచుకోలేదు. ఎందుకంటే, బాబూజీ మహరాజ్ దగ్గరినుంచి నేను ఒక రహస్యాన్ని నేర్చుకున్నాను. ఆయన ఎవరైనా ఒక వ్యక్తిని పొగిడినప్పుడు, ఆ వ్యక్తి సంస్థను వదిలి వెళ్ళిపోయేవాడు. "ఇందులో ఉన్న రహస్యమేమిటి?" వారు మీ పొగడ్తకు అర్హులా, కాదా అని మీకు తెలియనప్పుడు, మీరు వారిని ఎందుకు పొగుడుతారు? ఒకవేళ, దీన్ని గురించి మీ హృదయమేమైనా చెబుతుందా?" అని నేను బాబూజీని అడిగాను.

"నా హృదయం తప్పుడు విషయాలు ఎప్పుడూ చెప్పలేదు.

నేను ఎందుకు పొగుడుతానంటే,ఆ పొగడ్తకు తగిన స్థాయిని వారు చేరుకోవాలన్న ఉద్దేశ్యంతోనే. వారు ఎందుకు వదిలిపెట్టి వెళ్ళిపోతున్నారంటే, వారికి ఆ అర్హత లేదని తెలుసు కాబట్టి, తాము తప్పు చేస్తున్నామన్న భావముండడం వల్లనే. అందుకే వారు వెళ్ళిపోతున్నారు" అని ఆయన అన్నారు. "నిజమే. కానీ, నేను మీ సెక్రటరీని, నేను ఎప్పుడయితే సూటిగా మాట్లాడి, పరిశీలించినప్పుడు, అప్పుడూ వారు వెళ్ళిపోతున్నారన్న విషయం మీకు తెలుసు" అని నేనన్నాను. "ఔను, నిజమే. ఇది ఎందువల్లనంటే, వారు తామింకా తప్పు చేస్తున్నామన్న భావన వల్లనే. తాము చేయవలసినది చేయకుండా, చేయకూడనిది తాము చేస్తున్నామని వారి హృదయాలలో వారికి తెలుసు. వారు ఈ సంస్థలో ముఠాతత్వాన్ని సృష్టిస్తున్నారు. వారు సహజ మార్గపు సిద్ధాంతాలను, దశాదేశాలను పాటించడం లేదు" అని ఆయన అన్నారు. ఇంకా విరిస్తూ, "నీకు తెలుసు కదా! ప్రతి సంవత్సరము వచ్చే తుఫానులు, పెనుగాలులు చెట్లపైన ఉంటే ఎండుటాకులను తీసివేసేదానికి అవసరమే. అవే లేకపోతే, ఆకులు రాలవు. అందువల్లనే, కాలక్రమంలో సంభవించే ఇటువంటి జీవితపు శక్తులు పునఃప్రారంభానికి గాని, పునరుద్ధరణకు గాని కొంత భరోసా ఇవ్వాల్సిందే" అని ఆయన అన్నారు. "మీకు తెలుసు కదా, ఇక్కడున్న అత్యుత్తమమైన ఆదరణతోనే, పదిమంది అభ్యాసీలు చేరుతున్నపుడు, వారిలో కనీసం ఆరుమంది వదలిపోతున్నారు" అని నేనన్నాను." ఉండవలసినవారు ఉండితీరుతారు.వదిలి వెళ్ళిపోయినవారు నాలుగు జన్మల తర్వాత నయినా తప్పక వచ్చి తీరుతారు.ఆయన కోరికే నెరవేరుతుంది" అని వారు చెప్పారు.

## పోషక విలువలతో కూడిన పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



**కొమరోలు పెన్ పవర్ ఏప్రిల్ 15 :** కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మాతా శిశు సంరక్షణ వారి ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని వాటిని విజయవంతం చేయాలని కొమరోలు ఎంపీడీవో సయ్యద్ మస్తాన్ వలి పేర్కొన్నారు. ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభమైన పోషణ పక్వాడ్ పక్షోత్సవాల సందర్భంగా మంగళవారం కొమరోలు లోని ఏడవ నెంబరు అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని నిర్వహించారు .ఆ కార్యక్రమానికి కొమరోలు ఐసిడిసి సూపర్వైజర్ వసంత కుమారి అధ్యక్షత వహించగా ,ఎంపీడీవో సయ్యద్ మస్తాన్వలి, కొమరోలు వైద్యాధికారి దేవరశెట్టి చంద్రశేఖర్, కొమరోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర హెచ్ ఇ ఓ ఆవులయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆ కార్యక్రమానికి హాజరైన గర్భవతులు బాలింతలు చిన్నారుల తల్లిదండ్రుల ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ, గర్భవతులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నాయన్నారు.

అందులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, బాలింతలు చిన్నారులకు పోషక విలువలతో కూడిన పౌష్టికాహారాన్ని సరఫరా చేస్తున్నాయని ఆయన తెలిపారు. వాటిని గర్భవతులు ,బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులు కావాలని ఆయన కోరారు. అంగన్వాడీ కేంద్రంలో పనిచేస్తున్న టీచర్లు, ఆయాలు గర్భవతులు ,బాలింతలు, చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఐసిడిఎస్ సూపర్వైజర్ వసంతకుమారి మాట్లాడుతూ, ప్రతినెల అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భవతులు బాధితులు చిన్నారులకు పౌష్టిక విలువలతో కూడిన ఆహార పదార్థాలను కోడిగుడ్లను అందిస్తున్నామని ,అంతేకాక వారి ఆరోగ్య పరిరక్షణకు వైద్యారోగ్య శాఖ సిబ్బందితో పరీక్షలు చేయిస్తూ తమ సూచనలు సలహాలు ఇస్తున్నామని పేర్కొన్నారు. గర్భవతులు గర్భం దాల్చిన అప్పటినుంచి కాన్పు అయ్యేంతవరకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తోపాటు తమ అంగన్వాడి కేంద్రాల టీచర్లు ఆయాలు ఇచ్చే సూచనలు సలహాలను పాటిస్తూ ఉండాలన్నారు . మూఢనమ్మకాల తో ఎట్టి పరిస్థితులలో కాన్పులను ఇళ్ల వద్ద చేయించుకోవద్దని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి కాన్పులు చేయించుకోవడం తల్లి బిడ్డకు శ్రేయస్కరమని తెలిపారు. అంతేకాక ప్రభుత్వం జననీ సురక్ష పథకం ద్వారా ప్రభుత్వ ఆసుపత్రులకు చేయించుకున్న మహిళలకు



పారితోషికం కూడా అందజేస్తుందని, కాన్పు అనంతరం తల్లి బిడ్డను ప్రత్యేక వాహనంలో వారి ఇంటికి చేరవేస్తారని ఆమె తెలిపారు. పోషణ పక్వాడ్ పక్షోత్సవాలు ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయని ఈనెల 22వ తేదీ వరకు కొనసాగనున్నాయని ఆమె పేర్కొంటూ, పోషణ పక్వాడ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న వైద్యాధికారి చంద్రశేఖర్ ,హెచ్ ఈ ఓ ఆవులయ్య ,ఏఎన్ఎం ఖాదర్ బీ మహిళలు గర్భవతులు బాలింతలు చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు సూచనలు సలహాలు ఇచ్చారు. ఆ కార్యక్రమంలో చిన్నారులకు ఎత్తు ,బరువులు, సరిచూసి వారి తల్లిదండ్రులను సూచనలు సలహాలు ఇచ్చారు. కాగా ప్రభుత్వం సరఫరా చేసిన పౌష్టికాహార పదార్థాలను గర్భవతులకు ఎంపీడీవో మస్తాన్వలి పంపిణీ చేశారు.




**కడప, ఎన్ పవర్ ఏప్రిల్ 15 :**
కడప బిల్డప్ సర్కిల్‌లో దారుణ హత్య...
రవీంద్ర నగర్‌లో నివాసం ఉంటున్న సాధక్ దారుణ హత్య...

# ఏపీకి వచ్చేస్తున్న ఫ్రీ బస్సులు



**విజయవాడ, ఏప్రిల్ 15, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నట్లు కనపడుతుంది. ఆర్టీసీపై భారం పడకుండా ఎలక్ట్రికల్ త్తు బస్సులను రాష్ట్ర ప్రభుత్వం రెడీ చేస్తుంది. అయితే ఈ పథకం త్వరలోనే అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించినట్లు తెలసింది. అందుకోసమే అంతా సిద్ధం చేసిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు పథకం అమలు చేయాలని నిర్ణయించి ఈ మేరకు ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే మొదటి దశలో కొన్ని బస్సులను కొనుగోలు చేసిన ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లోని ముఖ్యమైన నగరాలకు, పట్టణాలకు పంపుతూనిర్ణయం తీసుకుంది. తక్కువ ఖర్చుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అందించేందుకు ఇవి ఉపయోగపడనున్నాయి. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు పథకం పై వివిధ రాష్ట్రాల్లో ఎదురవుతున్న ఇబ్బందులను గుర్తించిన ప్రభుత్వం ఆర్టీసీపై భారం పడకుండా ఉండేందుకు కొన్నిముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. గత ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు ఎన్నికల ప్రచారంలో స్పష్టమైన ఇచ్చిన హామీ అమలు చేయకపోతే మహిళల్లో వ్యతిరేకత వస్తుందని భావించిన ప్రభుత్వం త్వరలోనే ఈ పథకాన్ని అమలుచేయాలని భావిస్తూ ఎలక్ట్రికల్ బస్సులను పెద్ద సంఖ్యలో కొనుగోలు చేయాలని నిర్ణయించింది. దీనివల్ల ఉచిత ప్రయాణం పెద్దగా ఖర్చు లేకుండానే, భారం ఆర్టీసీపైనా, ప్రభుత్వంపైన పడకుండానే నామమాత్రంగా వ్యయంఅవుతుందని ప్రభుత్వం అంచనాలు వేస్తుంది. నగరాలకు కేటాయించి... అందులోనూ కొన్ని నిర్ణయాలు ఇతర రాష్ట్రాలకు భిన్నంగా తీసుకుంది. ఉచిత బస్సు ప్రయాణం జిల్లాల వరకే పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఎక్కువగా సిటీ బస్సుల్లో ఎక్కువ మంది ఉచితంగా నిత్యం తిరిగే అవకాశముందని భావించిన ప్రభుత్వం మొదటి దశలో 750 ఎలక్ట్రిక్ బస్సులను కొనుగోలు చేస్తుంది. ఇందులో వంద బస్సులు విశాఖపట్నానికి కేటాయించారు. మరో వంద బస్సులు విజయవాడకు ఇచ్చారు. గుంటూరుకు వంద, నెల్లూరుకు వంద, కర్నూలుకు యాభై బస్సులతో పాటు కాకినాడ, రాజమండ్రి, కడప మరియు అనంతపురం డిపోలకు

50 బస్సులు కేటాయించనున్నారు. తిరుపతితో పాటుమంగళగిరి డిపోలకు 50 బస్సులు కేటాయించారు. ఈ బస్సులకు ఛార్జింగ్ స్టేషన్లు సంబంధిత డిపోలలో ఏర్పాటు చేయనున్నారు. రద్దీ ఎక్కువగా ఉన్నచ్టో ఈ బస్సుల కేటాయింపు చేస్తూ భారం తగ్గించుకునే ప్రయత్నంలో భాగంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిసింది

# వక్ఫ్ బోర్డుపై సుప్రీంకు వైసీపీ... తప్పు పట్టిన బీజేపీ



**విశాఖపట్టణం, ఏప్రిల్ 15, పెన్ పవర్:** వక్ఫ్ బోర్డు చట్టం విషయంలో వైఎస్ఆర్‌సీపీ వ్యవహరిస్తున్న తీరుపై ఏపీ బీజేపీ ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి విమర్శలు గుప్పించారు. నాడు అధికారంలో ఉండి ఆంధ్రప్రదేశ్ అంతటా వక్ఫ్ భూములు లూటీ అయినప్పుడు కళు ్లమూసుకున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ, ఇప్పుడు ముస్లింల రక్షకుల్లా నటిస్తోందని విమర్శించారు. వైఎస్ఆర్‌సీపీ వక్ఫ్ చట్టాన్ని రక్షించడానికి కాదు %-% వారి పాలనలో వక్ఫ్ ఆస్తులు కబ్జా చేసిన నేరస్తులను కాపాడడానికే నేడు సుప్రీంకోర్టు లో సవాల్ చేస్తున్నారని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి మైనారిటీలంటే నిజమైన ప్రేమ కాదు , వారిని ఓటు బ్యాంక్ గానే చూస్తున్నారన్నారు. ఇప్పుడేమో కోర్టులను కూడా వాడుకుని తమ పాపాల్ని కడిగేసుకునే ప్రయత్నం చేస్తున్నారని.. ఇది అసహ్యకరమైన రాజకీయ నాటకమని విష్ణు విమర్శించారు. వక్ఫ్ బిల్లును చట్టంగా చేయడం రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో వైఎస్ఆర్‌సీపీ పిటిషన్ వేసింది. ముస్లిం సమాజం ఆందోళనలను పరిష్కరించడంలో వైఫల్యం, రాజ్యాంగ ఉల్లంఘనలను తీవ్రంగా పరిగణిస్తూ వక్ఫ్ చట్టాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశామని వైఎస్ఆర్‌సీపీ తెలిపింది. ఈ బిల్లు రాజ్యాంగంలోని ఆర్టికల్ 13, 14, 25 , 26 లను ఉల్లంఘిస్తుందని పిటిషన్‌లో పేర్కొంది. . ప్రాథమిక హక్కులు, చట్టం ముందు సమానత్వం, మత స్వేచ్ఛ , మతపరమైన వర్గాలు తమ సొంత వ్యవహారాలను నిర్వహించడానికి స్వయంప్రతిపత్తిని రాజ్యాంగం హామీ ఇచ్చిందన్నారు. సెక్షన్ 9 , 14 కింద ముస్లిమేతర సభ్యులను చేర్చడం వక్ఫ్ సంస్థల అంతర్గత పనితీరులో జోక్యంగా పరిగణించాలని.. ఈ నిబంధన బోర్డుల మతపరమైన లక్షణాన్ని, పరిపాలనా స్వచ్చను దెబ్బతీస్తుందని వైసీపీ తన పిటిషన్ లో పేర్కొంది. వక్ఫ్ చట్టం-2025 సవరణ బిల్లుపై సుప్రీంకోర్టులో పలువురు పిటిషన్లు దాఖలు చేశారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు, ఇతర ముస్లిం సంస్థలు, ఈ చట్టం రాజ్యాంగ విరుద్ధమని, ముస్లిం ఆస్తుల సేకరణకు వ్యతిరేకమని వాదిస్తూ పిటిషన్ వేశాయి. అసదుద్దీన్ ఓవైసీ, తృణమూల్ కాంగ్రెస్ తో పాటు తమిళనాడులో రాజకీయ పార్టీ పెట్టిన విజయ్ కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్లు ప్రధానంగా వక్ఫ్ చట్టంలోని సవరణలు రాజ్యాంగ విరుద్ధమని, మత స్వేచ్ఛను ఉల్లంఘిస్తాయని, వక్ఫ్ ఆస్తుల నిర్వహణపై ప్రభావం చూపుతాయని వాదిస్తూ దాఖలు చేశారు. నిజానికి వక్ఫ్ చట్టాన్ని పార్లమెంట్ లో వైఎస్ఆర్‌సీపీ వ్యతిరేకించింది. లోక్ సభలో బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేశారు. అయితే రాజ్యసభలో మాత్రం అనుకూలంగా ఓటేశారన్న ప్రచారం జరుగుతోంది. తాము బిల్లును వ్యతిరేకిస్తామని రాజ్యసభలో వైసీపీ పక్ష నేత సుబ్బారెడ్డి ప్రకటించారు. కానీ విపక్ష సభ్యులు .. వక్ఫ్ బిల్లును వ్యతిరేకించిన వారి ఓట్లు చూస్తే సరిపోలలేదు. మూడు ఓట్లు వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఎక్కువగా వచ్చాయి. అదే సమయంలో వ్యతిరేకించిన వారి ఓట్లు తక్కువగా వచ్చాయి. వైసీపీ సభ్యుల్లో ఒకరైన గుజరాత్ కు చెందిన పరిమిళ్ నత్వానీ బిల్లుకు అనుకూలంగా ఓటేశారని అంటున్నారు. ఆయన ఒక్కరే కాదని.. మరో ఇద్దరు, ముగ్గురు కూడా బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారని అంటున్నారు. విప్ జారీ చేశామని వైఎస్ఆర్‌సీపీ అంటున్నా.. ఓటింగ్ అయిపోయిన తర్వాత జారీ చేశారని టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. అయితే తాము బిల్లును సమర్థించడం లేదని నిరూపించుకునేందుకు వైసీపీ కోర్టులోనూ పిటిషన్లు దాఖలు చేసినట్లుగా భావిస్తున్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ లోక్ సభలో..రాజ్యసభలో వక్ఫ్ బిల్లును వ్యతిరేకించింది. కానీ రాజ్యసభ ఓటింగ్ సమయంలో కొంత మంది వైసీపీ సభ్యులు వక్ఫ్ బిల్లుకు మద్దతుగా ఓటేశారన్న ప్రచారం జరిగింది. అయితే తాము విప్ జారీ చేశామని వైసీపీ తెలిపింది. పలు పార్టీలు, వ్యక్తులు ఇప్పటికే సుప్రీంకోర్టులో పిటిషన్లు వేయగా వారితో పాటు వైసీపీ కూడా దాఖలు చేసింది.

# లిక్కర్ స్కాంలో రహస్యంగా విచారణ




**నెల్లూరు, ఏప్రిల్ 15, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కాంలో కీలక నిందితుడిగా భావిస్తున్న రాజ్ కసిరెడ్డి కోసం సిట్ బృందాలు గాలింపు ప్రారంభించాయి. హైదరాబాద్‌లో అరెటా హాస్పిటల్‌తో పాటు మరికొన్ని చోట్ల సిట్ బృందాలు సోదాలు చేస్తున్నాయి. హైదరాబాద్‌లో రాజ్ కసిరెడ్డి ఇల్లు, ఆఫీసుల్లోనూ సోదాలు చేస్తున్నారు. దాడుల్లో పాల్గొంటున్న సుమారు 10 నుంచి 15 సిట్ బృందాలు పాల్గొంటున్నాయి. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఐటీ సలహాదారుగా వ్యవహరించిన రాజ్ కసిరెడ్డి లిక్కర్ స్కాంపై సిట్ విచారణకు హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్నారు. ఆయన ముందస్తు బెయిల్ విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించినా విచారణకు హాజరు కావడం లేదు. ఏపీ మద్యం స్కాంలో సైలెంట్‌గా సీఐడీ సిట్ తన తాను పని చేస్తోంది. వారంతా కోర్టుకు వెళ్తున్నారు. కానీ హైకోర్టులో మాత్రం సానుకూల ఫలితం రావడం లేదు. ఏపీ లిక్కర్ స్కాంలో కర్త, కర్మ, క్రియ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి అంటూ విజయసాయిరెడ్డి గతంలో ప్రకటించారు. రాజ్ కసిరెడ్డిపై సీఐడీ ఎప్పుడో దృష్టి పెట్టింది. నోటీసులు జారీ చేసింది. ఆయన నోటీసులను తాజాగా హైకోర్టులో సవాల్ చేశారు. తనపై దూకుడైన చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అలాంటి ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసి ఆయన పిటిషన్ డిస్మిస్ చేసింది. కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డికి జగన్ ఐటీ సలహాదారుగా నియమించారు. ఏపీ లిక్కర్ స్కాంపై సీఐడీ చాలా లోతుగా దర్యాప్తు చేసింది. చాలా విషయాలు వెలుగులోకి తెచ్చిందని చెబుతున్నారు. ఏపీబీసీఎల్ మాజీ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి మొత్తం వ్యవహారాలపై రోజుల తరబడి స్టేట్ మెంట్ ఇచ్చారు. న్యాయమూర్తి ముందు కూడా వాంగ్మూలం ఇచ్చారు. దీంతో ఈ స్కాంలో కీలకంగా ఉన్న వారి గుట్టు అంతా బయటపడుతోందని చెబుతున్నర్నా. ఇప్పటికే మిథున్ రెడ్డికి ఈ స్కాంలో ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. అయితే ఆయన సుప్రీంకోర్టు నుంచి రిలీఫ్ తెచ్చుకున్నారు. వైసీపీ హయాంలో లిక్కర్ పాలసీపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి . వైసీపీ గెలవగానే ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేశారు. మద్యనిషేధం పేరిట దుకాణాలు తగ్గిస్తామని చెప్పి ఈ నిర్ణయం తీసుకున్నారు. అనూహ్యంగా బయట దొరికే బ్రాండ్ల మద్యం మొత్తం ఏపీలో బ్యాన్ చేశారు. కేవలం కొన్ని కంపెనీలు.. అది కూడా ఏపీ లోనే మద్యం అమ్మే కంపెనీలకే ఆర్డర్లు ఇచ్చారు. అవన్నీ వైసీపీ నేతలవన్న ఆరోపణలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వాటిపై దర్యాప్తు ప్రారంభించింది. ఈడీ కూడా విచారణ చేయాలని సిఫారసు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కు సంబంధించి హైదరాబాద్ లో ఏపీ సిట్ బృందాలు సోదాలు జరుపుతున్నాయి. రాజ్ కసిరెడ్డి కోసం హైదరాబాద్ లో గాలిస్తున్నాయి. రాయదుర్గం పోలీసుల సాయంతో అరెటా ఆసుపత్రిలో ఏపీ సిట్ బృందాలు సోదాలు చేశాయి. రాజ్ కసిరెడ్డి కుటుంబసభ్యులు అరెటా ఆసుపత్రిలో డైరెక్టర్లుగా ఉన్నారు. విచారణకు హాజరుకాకుండా కసిరెడ్డి హైదరాబాద్ లో తలదాచుకున్నట్లు సిట్ అనుమానిస్తోంది.ఏపీ లిక్కర్ స్కామ్ లో రాజ్ కసిరెడ్డి కీలకపాత్ర పోషించినట్లు గుర్తించాయి. జూబ్లీహిల్స్ తో పాటు గచ్చిబౌలి, ఫైనాన్స్ డిస్ట్రిక్ లో ఏపీ సిట్ బృందాలు గాలింపు చర్యలు చేపట్టాయి. రాజ్ కసిరెడ్డి దేశం దాటి వెళ్లకుండా ఇప్పటికే ఎల్‌ఓసీ ఇచ్చారు ఏపీ పోలీసులు. సిట్ విచారణకు హాజరుకావాలని ఏపీ హైకోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటికీ తప్పించుకుని తిరుగుతున్నారు రాజ్ కసిరెడ్డి. జూబ్లీహిల్స్ లోని రాజ్ కసిరెడ్డి నివాసానికి ఏపీ సిట్ బృందం నోటీసులు అంటించనుంది.

# 19వతేదీన ఏం జరగబోతోంది...

**విదేశీ టూర్ లలో కార్పొరేటర్లు**

**విశాఖపట్టణం, ఏప్రిల్ 15, పెన్ పవర్:** స్టీల్ సిటీలో రాజకీయాలు రసవత్తరంగా సాగుతున్నాయి. వైసీపీకి విశాఖలో మరో షాక్ తగిలింది. ఊహించినట్లుగానే ఆ పార్టీ నుంచి కార్పొరేటర్లు ఒక్కరొక్కరుగా చేజారిపోతున్నారు. తాజాగా వైసీపీ కార్పొరేటర్ తిప్పల వంశి జనసేన గూటికి చేరారు. మాజీ మంత్రి జనసేన నాయకుడు అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సమక్షంలో ఆయన జనసేన కండువా కప్పుకున్నారు. 74వ వార్డు కార్పొరేటర్ గా కొనసాగుతున్న వంశీ వైసీపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి తనయుడు.తిప్పలనాగిరెడ్డి తొలి నుంచి వార్డు అభివృద్ధిపై తమకు నిధులు కేటాయించడం లేదన్న అసంతృప్తితో రగిలిపోతున్నారంట. నిధుల కేటాయింపు విషయమై వంశీ కౌన్సిల్ సమావేశాల్లో పలు సందర్భాల్లో అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఐనా ఎటువంటి నిధులు కేటాయించకపోవడంతో చివరకు పార్టీ మారాలని నిర్ణయించుకొని జనసేనలో చేరిపోయారు. వంశీ జనసేనలో చేరడంతో గ్రేటర్ పీఠం కూటమి కైవసం చేసుకోబోతుందంటూ వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పై అవిశ్వాస తీర్మానానికి సంబంధించి సమయం దగ్గర పడుతుండడంతో నగరంలో పాలిటిక్స్ ఒక్కసారిగా వేడెక్కాయి. ఈనెల 19న అవిశ్వాస తీర్మానానికి సంబంధించి ఓటింగ్ జరగనుంది. దీంతో కొద్దిరోజులుగా క్యాంపు రాజకీయాలు ఊపందుకున్నాయి. అవిశ్వాస తీర్మానం నెగ్గి మేయర్ పీఠం దక్కించుకుంటామని టిడిపి బలంగా చెబుతోంది. ఎట్టి పరిస్థితుల్లో మేయర్ పదవిని నిలుపుకుంటామని వైసీపీ ధీమా వ్యక్తం చేస్తోంది. రెండు పార్టీలు క్యాంప్ రాజకీయాలకు తెరలేపాయి. కొంతమంది కార్పొరేటర్లను విదేశాలకు తరలించినట్లు జోరుగా ప్రచారం కూడా సాగుతోంది. అయితే మేయర్ పీఠం కైవసం చేసుకోవడానికి 74 మంది సభ్యుల అవసరంకాగా..ఇప్పటికే కూటమికి 70 మంది సభ్యులు సహకారం ఉంది.వీరితో పాటు మరో ఐదుగురు వైసీపీ సభ్యులు తమతో టచ్ లో ఉన్నారని పలు సందర్భాల్లో కూటమి నేతలు చెబుతున్నారంట. దీనికి తగ్గట్టుగానే వంశీ పార్టీ మారడంతో వైసీపీ వర్గాల్లో టెన్షన్ స్టార్ట్ అయిందట. దీంతో కార్పొరేటర్లు జారిపోకుండా శ్రీలంకలో శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. అటు కూటమి సైతం మలేసియాలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. జనసేన సైతం కౌలాలంపూర్ లో స్పెషల్ క్యాంపును ఏర్పాటు చేసిందట. 2021లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని వైసీపీ దక్కించుకుంది. 98 డివిజన్లు ఉన్న గ్రేటర్ విశాఖలో..58 డివిజన్లలో వైసీపీ విజయం సాధించింది. టిడిపి 29 స్థానాలకు పరిమితం అయింది. జనసేన మూడు చోట్ల గెలిచింది. అయితే మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో చాలామంది వైసీపీ కార్పొరేటర్లు కూటమిలో చేరారు. టీడీపీతో పాటు జనసేనలోకి అధిక సంఖ్యలో చేరడంతో కూటమి బలం పెరిగింది.దీనికి తోడు కూటమికి చెందిన ఎమ్మెల్యేలతో పాటు ఎంపీలు ఉన్నారు. ఎక్స్ ఆఫీషియో సభ్యులుగా వారు సైతం ఓటింగ్ కు వచ్చే అవకాశం ఉంది. అయితే వైసీపీ ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా చాలామంది కార్పొరేటర్లు..ముఖం చాటేస్తున్నారంట. బహిరంగంగానే తాము కూటమికి మద్దతు తెలుపుతామని కొంతమంది చెప్పినట్లు తెలుస్తోంది. దీంతో ఈనెల 19న జరిగే అవిశ్వాస తీర్మానం ఓటింగ్ లో కూటమి నెగ్గడం ఖాయమనే చర్చ నడుస్తోంది. మరి 19న జరిగే అవిశ్వాస తీర్మానంతో విశాఖ నగర పొలిటికల్ సీన్ మారుతుందా లేదా? ఆ రోజు అసలేం జరుగుతుందో చూడాలి.

# భర్తే...యముడు...

## ఇంట్లో చెప్పకుండా రెండేళ్లు మేనేజ్

**విశాఖపట్టణం, ఏప్రిల్ 156, పెన్ పవర్:** వారిద్దరి కులాలు వేరు.. మనసులు కలిశాయి.. పెళ్లి చేసుకోవాలని డిసైడ్ అయ్యారు. పెళ్లి జరిగి రెండేళ్లు అయ్యింది. ఈ విషయాన్ని భర్త తల్లిదండ్రులకు చెప్పకుండా మేనేజ్ చేశాడు. భార్య గర్భవతి అయ్యింది. రేపో మాపో పండంటి బిడ్డకు జన్మ ఇవ్వనుంది. అంతలో కట్టుకున్న భార్యని ఆ లోకం నుంచి పంపించేశాడు భర్త. సంచలన రేపిన ఈ ఘటన విశాఖ సిటీలో చోటు చేసుకుంది. పోలీసులు చెప్పిన కథనం ప్రకారం.. దువ్వాడకు చెందిన జ్ఞానేశ్వర్, సిటీలోని ఓ ప్రాంతానికి చెందిన అనూషను ప్రేమించాడు. అనూష తల్లికి చూపు మందగించింది. నాలుగేళ్ల కిందట తండ్రి చనిపోయాడు. ఆ ఇంటికి ఆమె పెద్ద దిక్కు అయ్యింది. మూడేళ్ల కిందట జ్ఞానేశ్వర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే వీరిద్దరు కులాలు వేరు వేర్వేరుజ్ఞానేశ్వర్ రెండు ఫాస్ట్ ఫుడ్ కేంద్రాలు నడుపుతున్నాడు. డబ్బులకు కొదవలేదు. పెళ్లి జరిగి మూడేళ్లు గడిచినా భార్యను తల్లిదండ్రులకు పరిచయం చేయలేదు జ్ఞానేశ్వర్. పెళ్లి జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పకుండా సిటీలో ఉద్యోగం చేస్తున్నానని వారిని నమ్మించాడు. అత్తమామల వద్దకు వెళ్దామని భార్య ఎప్పుడు అడిగినా రకరకాల కారణాలు చెప్పి తప్పించుకునేవాడు.భార్య అనూష గర్భవతి అయ్యింది. ప్రస్తుతం ఎనిమిదో నెల. వచ్చేవారంలో ఆమెకి డెలివరీ డేట్ ఇచ్చారు డాక్టర్లు. ఇప్పుడున్న సమయంలో భార్య డెలివరీ అయితే తల్లిదండ్రులతో లేనిపోని సమస్యలు వస్తాయని భావించాడు. ఇప్పుడున్న పరిస్థితుల్లో భార్యని ఏదోవిధంగా చంపేయడమే బెటరని నిర్ణయానికి వచ్చాడు.భార్యను వదిలించుకునేందుకు రకరకాల స్కెచ్‌లు వేశాడు. తనకు క్యాన్సర్ వచ్చిందని ఒకసారి, విడాకులు తీసుకుని వేరే పెళ్లి చేసుకోవాలని భార్యను కన్విన్స్ చేసే ప్రయత్నం చేసేవాడు. అందుకు భార్య ససేమిరా చెప్పింది. ఈ క్రమంలో భార్యభర్తల మధ్య తరచుగా గొడవలు జరిగేవి.గర్భిణిగా ఉన్న అనూషకు నెలలు నిండాయి. సోమవారం ఆమెని ఆసుపత్రిలో చేరాల్సి ఉంది. అక్కడే తన స్కెచ్‌ని పక్కాగా అమలు చేశాడు జ్ఞానేశ్వర్. ఆసుపత్రికి తోడు తీసుకెళ్లేందుకు అమ్మమ్మను రెండు రోజుల కిందట ఇంటికి పిలిచాడు. ఆదివారం రాత్రి భార్యాభర్తలు కలిసి నిద్రపోయాడు. ఇదే సరైన సమయమని భావించాడు భర్త.సోమవారం వేకువజామున నిద్రలో ఉన్న భార్యను గొంతు నులిమి హత్య చేశాడు. తెల్లారిపోయింది.. మనుమరాలు నుంచి కనీసం ఉలుకు పలుకు లేదు. దీంతో వాళ్ల అమ్మమ్మ కంగారుపడి జ్ఞానేశ్వర్‌ను పిలిచింది. పైకి ఏమీ తెలియనట్టు స్థానికులతో కలిసి భార్యను కేజీహెచ్‌కు తరలించాడు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు.దీనిపై స్థానికుల్లో అనుమానాలు మొదలయ్యాయి. చివరకు ఈ వ్యవహారం పోలీసుల వద్దకు చేరింది. జ్ఞానేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు పీఎం పాలెం పోలీసులు. దీంతో అసలు విషయం బయటపడింది. ప్రేమ పేరుతో అనూషను నమ్మించి మోసం చేశానని తెలిపాడు. ఆమెని వదిలించుకునే ప్రయత్నంలో హత్య చేసినట్టు అంగీకరించాడు.

# ఏపీలో ఐదు చోట్ల రోప్ వేలు

**కర్నూలు, ఏప్రిల్ 15, పెన్ పవర్:** ఏపీలో కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ముఖ్యంగా పర్యాటక రంగానికి పెద్ద పీట వేస్తోంది. ఇప్పటికే సీ ప్లేన్ తో ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రాలను కలుపుతూ మార్గాన్ని ఏర్పాటు చేసింది. విజయవంతంగా సిప్లేన్లను నడుపుతోంది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి రాష్ట్రవ్యాప్తంగా రోప్ వేల నిర్మాణం పై ఫోకస్ పెట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఎందుకు సంబంధించి నేషనల్ హైవే లాజిస్టిక్ అథారిటీతో ఒప్పందం చేసుకుంది రాష్ట్ర ప్రభుత్వం.రోప్ వేలు ఇప్పటికే విశాఖ నగరంలో అందుబాటులో ఉన్నాయి. నగరంలోని కైలాసగిరి వద్ద వీటిని ఏర్పాటు చేశారు. పర్యాటకులను సైతం ఆకట్టుకుంటున్నాయి. అయితే తాజాగా ఐదు చోట్ల వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. చిత్తూరు జిల్లాలోని బోయకొండ గంగమ్మ ఆలయం, నంద్యాల జిల్లాలోని అహోబిలం, పల్నాడు జిల్లాలోని కోటప్పకొండ, విజయవాడలోని భవానీ ద్వీపం, తూర్పుగోదావరి జిల్లాలోని కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయం దగ్గర ఏర్పాటు చేయనున్నారు. రూప్ వేలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును తీసుకొస్తోంది కూటమి ప్రభుత్వం.2014లో టిడిపిఅధికారంలోకి వచ్చింది. ఆ సమయంలోనే ఈ ప్రాజెక్టుల కోసం ప్లాన్ చేసింది. అప్పటిలో నివేదికలను సైతం రూపొందించింది. అయితే తర్వాత వచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం దీనిని పెద్దగా పట్టించుకోలేదు. మళ్లీ ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడంతో కొంత కదలిక వచ్చింది. ఇప్పటికే పర్యాటక శాఖ అధికారులు కొన్ని ప్రాంతాల్లో స్థల పరిశీలన చేశారు. ఒకటి రెండు చోట్ల డిపిఆర్లను సైతం తయారు చేశారు. జాతీయ రహదారుల లాజిస్టిక్ అథారిటీతో మాట్లాడిన తర్వాత రూప్ వేల నిర్మాణానికి అడుగులు వేయాలని పర్యాటక అభివృద్ధి సంస్థ అధికారులు భావిస్తున్నారు. అవసరం అనుకుంటే ప్రభుత్వం సైతం నిధులు వెచ్చించేందుకు ఆలోచన చేస్తోంది. ఐదేళ్ల వైయస్సార్ కాంగ్రెస్ పాలనలో పర్యాటక రంగానికి ఆశించిన స్థాయిలో కేటాయింపులు లేవు. ఆ శాఖలో అభివృద్ధి కూడా అంతంతమాత్రంగానే ఉండేది. అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం పర్యాటక రంగంపై దృష్టి పెట్టడం విశేషం. మరోవైపు రాష్ట్రంలో డ్రోన్ రంగంలో పెట్టుబడిదారులు, వ్యాపారులు, ప్రజలను అనుసంధానం చేసేందుకు ఏపీ డ్రోన్ మార్ట్ పేరిట ఓ పోర్టల్ ను డ్రోన్ కార్పొరేషన్ అందుబాటులోకి తీసుకురావాలని నిర్ణయించింది. డ్రోన్ల తయారీ రంగంలో ఉన్న అపార అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు తగిన ప్రతిపాదనలతో రావాలని సంస్థ కోరింది. ఇప్పటికే ఏపీ ప్రభుత్వం డ్రోన్ల హబ్ గా అమరావతిని తీర్చిదిద్దాలని భావిస్తోంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తోంది

## ఇది మామూలు దెబ్బ కాదు: పంజాబ్‌కు బిగ్ షాక్..

# ఐపీఎల్ నుంచి వరల్డ్ క్లాస్ పేసర్ ఔట్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2025లో పంజాబ్ కింగ్స్ జట్టుకు ఊహించని షాక్ తగిలింది. ఆ జట్టు స్టార్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ మోకాలి గాయం కారణంగా మిగతా ఐపీఎల్ సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. "న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్ లాకీ ఫెర్గూసన్ కాలికి చాలా తీవ్రమైన గాయమైంది. అతను ఐపీఎల్ మిగతా మ్యాచ్ లకు దూరం కానున్నాడు". అని పంజాబ్ కింగ్స్ తెలిపింది. బౌలింగ్ లో కాస్త బలహీనంగా ఉన్న పంజాబ్ కింగ్స్ ఫెర్గూసన్ కు మిస్ కావడం ఆ జట్టుకు పెద్ద ఎదురు దెబ్బ.

ఈ కివీస్ పేసర్ స్థానంలో ఇంకా ఎవరినీ ఎంపిక చేయలేదు. శనివారం (ఏప్రిల్ 12) సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్ ఆడుతుండగా ఫెర్గూసన్ గాయపడ్డాడు. ఈ మ్యాచ్ లో కేవలం రెండు బంతులు మాత్రమే బౌలింగ్ చేసి కాలు పట్టుకొని ఇబ్బందిగా కనిపించాడు. ఎడమ తొడను పట్టుకుని కుంటుతూ కనిపించాడు. బౌలింగ్ చేయలేక పోవడంతో అతడు పెవిలియన్ కు చేరాడు. ఫెర్గుసన్ గాయం పంజాబ్ కు పెద్ద మైనస్ గా మారింది.

మొదట బ్యాటింగ్ చేసి పంజాబ్ 245 పరుగుల భారీ స్కోర్ చేసినా.. సన్ రైజర్స్ అలవోకగా లక్ష్యాన్ని ఛేజ్ చేసింది. గాయంతో ఛాంపియన్స్ ట్రోఫీకి దూరమైన ఈ న్యూజిలాండ్ ఫాస్ట్ బౌలర్.. ఆ తర్వాత కోలుకొని ఐపీఎల్ 2025 ఆడాడు. అయితే అతనికి మరోసారి గాయం కావడంతో స్వదేశానికి పయనం కానున్నాడు. ఐపీఎల్ 2025 మెగా ఆక్షన్ లో పంజాబ్ కింగ్స్ ఫెర్గుసన్ ను రూ.2 కోట్ల కనీస ధరకు దక్కించుకుంది. ఐపీఎల్ లో ప్రస్తుతం పంజాబ్ బాగా రాణిస్తుంది. ఆడిన ఐదు మ్యాచ్ ల్లో మూడు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో ఉంది. మంగళవారం (ఏప్రిల్ 15) కోల్ కతా నైట్ రైడర్స్ తో కీలక మ్యాచ్ కు సిద్ధమవుతుంది. నేడు జరగనున్న ఈ మ్యాచ్ లో గెలిస్తే టాప్ 4 లో నిలుస్తుంది.

# పాకిస్థాన్ బ్యాటర్ సంచలనం.. సెంచరీలతో కోహ్లీ, బట్లర్, గేల్ రికార్డ్ సమం



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్తాన్ క్రికెటర్ సాహిబ్‌జాదా ఫర్హాన్ టీ20 క్రికెట్ లో తన హవా చూపిస్తున్నాడు. ముఖ్యంగా 2025 లో పొట్టి ఫార్మాట్ లో సెంచరీల వర్షం కురిపిస్తున్నాడు. తన అసాధారణ ఫామ్ తో ఒకే క్యాలెండర్ ఇయర్ లో నాలుగు సెంచరీలు చేసి స్టార్ ఆటగాళ్లు విరాట్ కోహ్లీ, శుభ్‌మాన్ గిల్, జోస్ బట్లర్, క్రిస్ గేల్‌ల సరసన చేరడం విశేషం. పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025 లో ఇస్లామాబాద్ యునైటెడ్ తరపున ఓపెనర్‌గా బరిలోకి దిగిన సాహిబ్‌జాదా ఫర్హాన్.. పెషావర్ జల్మిపై సోమవారం (ఏప్రిల్ 14) జరిగిన మ్యాచ్ లో సెంచరీ కొట్టడం ద్వారా ఈ ఘనత సాధించాడు. ఈ మ్యాచ్ లో కేవలం 52 బంతుల్లో 203.85 స్ట్రైక్ రేట్‌తో 106 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్ లో 13 బౌండరీలు, ఐదు సిక్సర్లు ఉన్నాయి. ఈ సెంచరీతో క్యాలెండర్ ఇయర్ లో నాలుగు టీ20 సెంచరీలు చేసిన ఐదో ఆటగాడిగా నిలిచాడు. వెస్టిండీస్ దిగ్గజ క్రికెటర్ యూనివర్స్ బాస్ క్రిస్ గేల్ 2011లో తొలిసారిగా ఈ ఘనత సాధించాడు. 2016లో 'రన్ మెషిన్' విరాట్ కోహ్లీ ఈ జాబితాలో చేరగా.. ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ జోస్ బట్లర్ 2022లో.. శుభ్‌మన్ గిల్ 2023లో ఈ అరుదైన ఫీట్ అందుకున్నారు.

సాహిబ్జాదా ఈ సంవత్సరం తన తొలి సెంచరీని పెషావర్ రీజియన్ తరపున ఆడుతున్నప్పుడు సాధించాడు. మార్చి 15న అతను 59 బంతుల్లో 114 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆ తర్వాత వారం రోజుల్లోనే క్వెట్టాపై జరిగిన మ్యాచ్‌లో 72 బంతుల్లో 162 పరుగులు.. పాకిస్తాన్ నేషనల్ టీ20 కప్ సెమీఫైనల్ మ్యాచ్‌లో అబోటాబాద్‌తో 72 బంతుల్లో 148 పరుగులు చేసి మరోసారి సెంచరీ సాధించాడు. నాలుగో సెంచరీ సోమవారం (ఏప్రిల్ 14) పెషావర్ జల్మిపై బాదాడు. అతని విధ్వంసకర ఇన్నింగ్స్ తో ఇస్లామాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది.

# శ్రేయస్ అయ్యర్‌కు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ ఏడాది భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ గెలవడంలో కీలక పాత్ర పోషించిన టీమిండియా స్టార్ బ్యాటర్ శ్రేయస్ అయ్యర్‌కు మార్చి నెలకు గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు వరించింది. ఐసీసీ మెగా ఈవెంట్ ఛాంపియన్స్ ట్రోఫీలో అయ్యర్ 243 రన్స్‌తో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా 30 ఏళ్ల ఈ స్టార్ ప్లేయర్ మార్చిలో మూడు మ్యాచ్ ల్లో 57.33 సగటున, 77.47 స్ట్రైక్ రేట్‌తో 172 పరుగులు చేశాడు. ఇక మార్చి నెలకు గాను ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు కోసం అయ్యర్‌తో పాటు న్యూజిలాండ్‌కు చెందిన జాకబ్ డఫీ, రచిన్ రవీంద్రలు కూడా పోటీ పడ్డారు. వారిద్దరినీ అధిగమించి అయ్యర్ ఈ అవార్డును గెలుచుకోవడం విశేషం. ఈ సందర్భంగా తనకు దక్కిన ఈ గౌరవం పట్ల అయ్యర్ హర్షం వ్యక్తం చేశాడు. "మార్చి నెలలో ఐసీసీ పురుషుల ప్లేయర్ ఆఫ్ ది మంత్ గా ఎంపిక కావడం నాకు నిజంగా గౌరవంగా ఉంది. ఈ గుర్తింపు చాలా ప్రత్యేకమైంది. ముఖ్యంగా మనం ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ గెలిచిన నెలలో నాకు ఈ అవార్డు రావడాన్ని నేను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను. ఇంత పెద్ద వేదికపై భారత్ విజయానికి తోడ్పడగలగడం ప్రతి క్రికెటర్ కల. నా సహచరులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది వారి అచంచలమైన మద్దతు, నమ్మకానికి నా కృతజ్ఞతలు. అభిమానులకు కూడా హృదయపూర్వక ధన్యవాదాలు. వారి ప్రోత్సాహం మమ్మల్ని అడుగడుగునా ముందుకు నడిపిస్తున్నాయి" అని అయ్యర్ తెలిపాడు. ఛాంపియన్స్ ట్రోఫీలో గ్రూప్ దశలో న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అయ్యర్ 98 బంతుల్లో 79 పరుగులు చేశాడు. అలాగే సెమీ-ఫైనల్లో ఆస్ట్రేలియాపై భారతదేశం సాధించిన విజయంలో అతను 62 బంతుల్లో 45 పరుగులు చేసి కీరోల్ పోషించాడు. అలాగే ఫైనల్లో న్యూజిలాండ్‌పై 62 బంతుల్లో 48 రన్స్ బాదిన అయ్యర్, టీమిండియాను గెలిపించాడు.

కాగా, ఈ అవార్డు వరుసగా రెండు నెలలు భారత ప్లేయర్లకే దక్కడం గమనార్హం. ఫిబ్రవరికి గాను యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్ ఈ అవార్డును గెలుచుకున్నాడు. ఇక ఇప్పటివరకు ఈ అవార్డును 8 మంది భారత క్రికెటర్లు సాధించారు. ఇందులో గిల్ మూడు సార్లు గెలిస్తే... జస్ప్రీత్ బుమ్రా, శ్రేయస్ అయ్యర్ రెండేసి సార్లు గెలిచారు. అలాగే విరాట్ కోహ్లీ, రవిచంద్రన్ అశ్విన్, భువనేశ్వర్ కుమార్, రిషభ్ పంత్, యశస్వీ జైస్వాల్ ఒక్కోసారి సాధించారు.

## షార్వరి యొక్క అద్భుతమైన ఫ్యాషన్ చిత్రాలు



# డ్రాగన్, స్పిరిట్, పెద్ది ఇండియన్ బాక్సాఫీస్‌ని షేక్ చేస్తాయా?



ఇండియన్ సినిమాల్లో ప్రధానంగా అభిమానులు, ట్రేడ్ వర్గాలు ప్రత్యేకంగా చర్చించుకుంటున్న సినిమాల జాబితాలో ముందు వరుసలో నిలుస్తున్న క్రేజీ పాన్ ఇండియా మూవీస్ డ్రాగన్, స్పిరిట్, పెద్ది. ఈ మూడు సినిమాలు దేనికదే ప్రత్యేకమైనవి. అంతే కాకుండా తొలిసారి స్టార్ హీరోలు, క్రేజీ డైరెక్టర్లు కలిసి చేస్తున్న ప్రాజెక్ట్‌లివి. ఈ మూవీస్ గురించి ఇప్పటికే అభిమానుల్లో, ట్రేడ్ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ మూడు క్రేజీ పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లలో రామ్ చరణ్ హీరోగా - ఉప్పెన - ఫేమ్ బుచ్చిబాబు సాన రూపొందిస్తున్న -పెద్ది - గ్లింప్స్ ఇటీవలే విడుదలై నెట్టింట సంచలనం సృష్టించడం తెలిసిందే. ఈ మూవీని వచ్చే ఏడాది మార్చి 27న భారీ స్థాయిలో రిలీజ్ చేయబోతున్నారు. మరొకటి పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా సందీప్ రెడ్డి వంగ తెరకెక్కించనున్న హైవోల్టేజ్ యాక్షన్ డ్రామా. టి సిరీస్ బ్యానర్‌తో కలిసి భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై సందీప్‌రెడ్డి వంగ సోదరుడు ప్రణయ్ వంగ నిర్మాణ భాగస్వామిగా వ్యవహరించనున్నారు. ప్రభాస్ పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా నటించనున్న ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ఎప్పుడెప్పుడు స్టార్ట్ అవుతుందా? అని అభిమానులు, సినీ లవర్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

అక్టోబర్‌లో ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానున్నట్టుగా తెలుస్తోంది. 2027లో దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో ఉన్నారు. % -యానిమల్ - తరువాత సందీప్ రెడ్డి వంగ నుంచి వస్తున్న సినిమా కావడంతో దీనిపై దేశ వ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి. ఇక దీనితో పాటు యంగ్ టైగర్ ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్‌ల కాంబినేషన్‌లో రానున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా -డ్రాగన్ - కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఇప్పటికే షూటింగ్ ప్రారంభించారు. ఈ నెల 22 నుంచి ఎన్టీఆర్ సెట్‌లోకి అడుగు పెట్టబోతున్నాడు. వచ్చే ఏడాది జనవరి 9న ఈ మూవీని రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు కానీ ఆ రోజున వచ్చే అవకాశం లేదని ఏప్రిల్లో ఈ ప్రాజెక్ట్‌ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నారని ఇన్ సైడ్ టాక్. ఇదిలా వుంటే ఈమూడు పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లు కావడం విశేషం. ఈ మూడు సినిమాలు రికార్డు స్థాయి వసూళ్లతో ఇండియన్ బాక్సాఫీస్‌ని షేక్ చేయడం ఖాయం అని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ మూడు క్రేజీ ప్రాజెక్ట్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నానని రాజమౌళి ప్రకటించడంతో వీటిపై అందరిలో మరింత ఆసక్తి పెరిగింది.

## రష్మిక మందన్న యొక్క అందమైన మ్యాగజైన్ ఫోటోలు



On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com